


# ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక




సంపుటి: 4 సంచిక: 275, పేజీలు - 08

గురువారం, ఫిబ్రవరి 20, 2025 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

## సీఈసీగా బాధ్యతలు స్వీకరించిన జ్ఞానేష్ కుమార్



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి జ్ఞానేష్ కుమార్ భారత 26వ ప్రధాన ఎన్నికల కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జ్ఞానేష్ కుమార్ ను దేశ తదుపరి ప్రధాన ఎన్నికల కమిషనర్ గా, హర్యానా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వివేక్ జోషిని ఎన్నికల కమిషనర్ గా నియమించినట్లు సోమవారం రాత్రి ఒక గెజిట్ నోటిఫికేషన్ ద్వారా న్యాయ మంత్రిత్వ శాఖ తెలియజేసింది. సీఈసీగా

2లో..

## తెలంగాణ ప్రజల కోసం
# పోరాడేదే బీఆర్ఎస్

- తెలంగాణ ప్రజల కష్టనష్టాలు బీఆర్ఎస్‌కు మాత్రమే తెలుసన్న కేసీఆర్
- కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్న కేసీఆర్ - ఏప్రిల్ 27న బీఆర్ఎస్ బహిరంగ సభను నిర్వహించాలని నిర్ణయం

**తెలంగాణలో మళ్లీ అధికారం తమదేనని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. దాదాపు 6 నెలల తర్వాత.. తెలంగాణభవన్‌లో కేసీఆర్ అడుగుపెట్టారు. కేసీఆర్ అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇందులో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తెలంగాణలో మళ్లీ వందశాతం అధికారంలోకి వస్తామని కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో కీలక విషయాలపై గులాబీ శ్రేణులతో చర్చించారు. ఈ భేటీలో బీఆర్ఎస్ పార్టీ ఏర్పడి 25 ఏళ్లు కావస్తున్న నేపథ్యంలోనే సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సిల్వర్ జూబ్లీ వేడుకలకు సంవత్సరం పాటు నిర్వహించాలని పేర్కొన్నారు.**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఎంపీ ఎన్నికల్లో పార్టీ ఓడిపోయిన తర్వాత బీఆర్ఎస్ కు చెందిన కొంత మంది ముఖ్య నేతలు వ్యతిరేక ప్రచారం చేశారని కార్యవర్గ సమావేశంలో కేసీఆర్ పార్టీ నేతలపై అసహనం వ్యక్తం చేసినట్లుగా తెలుస్తోంది. పార్టీ భవిష్యత్ కష్టమని ప్రచారం చేయడంతో నైరాశ్యంతో పది మంది ఎమ్మెల్యేలు పార్టీ మారారని అన్నారు. ఉద్యమంలో పుట్టిన పార్టీ అని ఒక్క ఓటమితో కొట్టుకుపోయే పార్టీ కాదన్నారు.

### గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతం కోసం చర్యలు

తెలంగాణ రాజకీయ అస్తిత్వ పార్టీగా,

2లో..



## ఢిల్లీ కొత్త సీఎంగా రేఖా గుప్త

### - తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి సీఎం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఢిల్లీ సీఎం ఎవరు అనేదానిపై సస్పెన్స్ వీడింది. ఎట్టకేలకు ఢిల్లీ ముఖ్యమంత్రి ఎవరు అనే ఉత్కంఠకు తెరపడింది. 12 రోజుల నిరీక్షణకు తెరతీస్తూ రేఖా గుప్తాను ఢిల్లీ ముఖ్యమంత్రిగా బీజేపీ ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. ఢిల్లీ తదుపరి సీఎంగా రేఖా గుప్తాను ఎంపిక చేశారు. ఇక మొదటి నుంచి సీఎం రేసులో ముందువరుసలో ఉన్న పర్వేష్ వర్మకు మొండిచేయి

2లో..

## మాకు అధికారమే పరమావధి కాదు

### - తెలంగాణ అస్తిత్వం, ప్రజల ప్రయోజనాలే ముఖ్యమన్న కేటీఆర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) అధికారమే పరమావధిగా పనిచేసే ఆలోచన తమకు లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన పార్టీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ రజతోత్సవం ప్రజా

2లో..

## 21 ఏళ్లుగా ఊపిరితిత్తుల్లో ఇరుక్కుపోయిన పెన్ క్యాప్

### - వైద్యుల మైండ్ బ్లాంక్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) చిన్న పిల్లలు ఆడుకుంటూ ఏదో ఒకటి నోట్లో పెట్టుకోవడం అలవాటు. అందుకే పెద్దలు ఎప్పుడూ వారి వెంట ఉండి గమనిస్తూ ఉంటారు. అయితే ఓ యువకుడు 5 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు ఆటలాడుతూ పొరపాటున పెన్ క్యాప్ మింగేశాడు. అయితే ఇటీవల ఆ యువకుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఊపిరితీసుకోవడంలో ఇబ్బంది, విపరీతమైన దగ్గు లాంటివి

2లో..

## రోడ్లు సల సల

### - చురుక్కుమంటున్న ఎండలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండి పోతున్నాయి. భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఉదయం ఏడు గంటల నుంచే చురుక్కుమనేలా శరీరంపై సూదులు గుచ్చినట్లు అనిపిస్తుంది.

2లో..

## చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదు,
# జగన్‌కు దమ్ములేదు

### - రెండు పార్టీలపై షర్మిల ఫైర్



**అమరావతి** ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం హామీలు అమలు చేయడం లేదని, వాటిని అసెంబ్లీలో అడిగే దమ్ము జగన్ మోహన్ రెడ్డికి లేదని ధ్వజమెత్తారు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల. సోషల్ మీడియా వేదికగా ఇద్దరిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజలపై ప్రేమ ఉంటే నిరూపించుకోవాలని సవాల్ చేశారు.

### 9 నెలల్లో 90 కారణాలు

భారీ ఎన్నికల హామీలు ఇచ్చిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి సంగతి మర్చిపోయారని మండిపడ్డారు. సూపర్ సిక్స్ పథకాలు ఫ్లాప్ అయ్యాయని అన్నారు. వాటి అమలు గురించి అడిగితే ఈ 9 నెలల్లో 90 కారణాలు చెప్పారని విమర్శించారు. ఇప్పటికైనా హామీల అమలుపై దృష్టి పెట్టాలని సూచించారు. వాటిని అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని సవాల్ చేశారు.

### బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించండి

ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇచ్చినహామీలు నెరవేర్చేందుకు బడ్జెట్ కావాల్సిన నిధులు కేటాయించాలని షర్మిల డిమాండ్ చేశారు. 28న ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో వాటికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి అన్ని పథకాలు ఏడాది లోపు అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.

### కూటమిప్రభుత్వాన్ని ప్రశ్నించే దమ్ములేదు

ప్రజలకు ఇచ్చిన పథకాలు అమలు గురించి అడిగే దమ్ము వైసీపీకి లేదన్నారు షర్మిల. నేరస్థులను, దౌర్జన్యం చేసిన వాళ్ళను జైలుకెళ్లి పరామర్శించే సమయం జగన్ మోహన్ రెడ్డికి ఉంటుందని ఎద్దేవా చేశారు. ప్రజల కోసం అసెంబ్లీకి వెళ్లేందుకు మాత్రం ఆయనకు మొహం చెల్లదని సెటైర్లు

2లో..

## ఆంధ్రప్రదేశ్ పాలిటిక్స్‌లో
# మిర్చి మసాలా

### - జగన్ గరం గరం - ఘాటుగా బదులిచ్చిన ప్రభుత్వం

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌లో ఎండలతోపాటు రాజకీయం కూడా వేడెక్కింది. అసెంబ్లీకి ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నిస్తున్న ప్రభుత్వానికి జనంలో ఉంటూనే జగన్ మోహన్ రెడ్డి బదులిస్తున్నారు. ప్రశ్నలు సంధిస్తున్నారు. అటు నుంచి అధికార పార్టీ నేతలు కూడా ఘాటుగానే బదులిస్తున్నారు. మరోవైపు షర్మిల ఇద్దరిపై విరుచుకుపడుతున్నారు. మొత్తానికి ఆంధ్రప్రదేశ్ రాజకీయం మిర్చి మసాలగా మారింది.




### రైతులు సంతోషంగా లేరు - జగన్

మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి స్పీడ్ పెంచినట్టు కనిపిస్తున్నారు. మంగళవారం జైల్లో వంశీని పరామర్శించారు. బుధవారం గుంటూరు మిర్చియార్డ్‌కు వెళ్లారు. అక్కడ రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన ఆంధ్రప్రదేశ్‌లో రైతులు సంతోషంగా లేరని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి న్యాయం జరగడం లేదని విమర్శించారు. ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో పంటలకు గిట్టుబాటు ధర రావడం లేదని ధ్వజమెత్తారు. కొత్తప్రభుత్వం వచ్చిన తర్వాత పెట్టుబడి సాయం రావడం లేదని, సున్నా వడ్డీకి రుణాలు ఇవ్వలేకపోయారని జగన్ మండిపడ్డారు. కల్తీ విత్తనాలు సరఫరా ప్రభుత్వమే చేస్తోందని ఆరోపించారు. మిర్చి రైతుల కష్టాలు చంద్రబాబుకు కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో దళారులు ఇష్టారాజ్యంగా దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే రైతులకు అండగా వైసీపీ పోరుబాట పడుతుందన్నారు జగన్.

### మాది స్వర్ణ యుగం - జగన్

ఈ టూర్ తర్వాత సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన జగన్ కూటమి ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించారు. రాష్ట్రంలో మొన్నటి వరకు

2లో..

## ఎల్ఆర్ఎస్‌పై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

- గత నాలుగేళ్లుగా ప్లాట్లు కొనుగోలు చేసిన వారికీ అవకాశమివ్వాలని నిర్ణయం
- ఎల్ఆర్ఎస్‌ను మరింత పకడ్బందీగా అమలు చేయాలని నిర్ణయం
- పది శాతం రిజిస్టరైన లేఔట్లలో మిగిలిన ప్లాట్లకు అవకాశమివ్వాలని నిర్ణయం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ సర్కారు శుభవార్త వినిపించింది. ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం) పకడ్బందీగా అమలు చేయాలని నిర్ణయించింది. ఎల్ఆర్ఎస్ పథకం అమలుపై బుధవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో గత నాలుగేళ్లుగా ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి కూడా ఎల్ఆర్ఎస్‌కు అవకాశం ఇవ్వాలని నిర్ణయించారు. 10 శాతం ప్లాట్లు రిజిస్టరైన లేఅవుట్లలో.. మిగిలిన 90 శాతం ప్లాట్ల

2లో..

## గ్రీన్ ఫీల్డ్ హైవే
# భూసేకరణ రచ్చ

### - కేంద్రప్రభుత్వం వర్సెస్ రాష్ట్రప్రభుత్వం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో గ్రీన్ ఫీల్డ్ హైవే భూసేకరణపైన రచ్చ కొనసాగుతుంది. రైతులు గ్రీన్ ఫీల్డ్ హైవే కోసం తాము ఇచ్చే భూములకు ప్రభుత్వం ఇస్తామని చెప్పిన పరిహారం సరిపోదని పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. ఈ క్రమంలో నింద కేంద్రం పైన వేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని, అయితే రాష్ట్ర ప్రభుత్వమే రైతుల విషయంలో సానుకూలంగా లేదని బిజెపి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

### - గ్రీన్ ఫీల్డ్ హైవే భూసేకరణ విషయంలో రచ్చ

కేంద్ర ప్రభుత్వం వర్సెస్ రాష్ట్ర

2లో..

## మెరిట్ ఆధారంగానే
# వీసీలను నియమించాం

### - సీఎం చంద్రబాబు



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నత విద్య సరికొత్త అధ్యాయాన్ని సూచిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. వైస్ ఛాన్సలర్లను పూర్తి మెరిట్ ఆధారంగా నియమించామని ఆయన తెలిపారు. భావి పౌరులను రూపొందించడంలో

2లో..




## హైదరాబాద్‌లో
# మిస్ వరల్డ్ పోటీలు

### - హాజరు కానున్న 120 దేశాల భామలు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** విశ్వనగరంగా ఎదుగుతున్న హైదరాబాద్‌కు మరో అరుదైన కార్యక్రమానికి వేదికగా నిలవనుంది. ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే.. మిస్ వరల్డ్ పోటీలు ఈసారి హైదరాబాద్ వేదికగా జరగనున్నాయి. మిస్ వరల్డ్ పోటీలు.. మే 7వ తేదీ నుంచి 31వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహించేందుకు అన్ని ప్రణాళికలు సిద్ధం

2లో..

## 5 రాష్ట్రాలకు విపత్తు సాయం

### - రూ.1555 కోట్లు విడుదల చేసిన కేంద్రం



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** 2024 ఏడాదికి సంబంధించి దేశంలోని వివిధ రాష్ట్రాల్లో సంభవించిన విపత్తులు, వరదలకు సంబంధించి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన ఏర్పాటైన ఉన్నత

2లో..

## సీఈసీగా బాధ్యతలు స్వీకరించిన జ్ఞానేష్ కుమార్

జ్ఞానేష్ కుమార్ పదవీ కాలం జనవరి 26, 2029 వరకు ఉంటుంది. అంతకు ముందు ఈ పదవిలో ఉన్న రాజీవ్ కుమార్ ఫిబ్రవరి 18న పదవీ విరమణ చేశారు. జ్ఞానేష్ కుమార్ 4 సంవత్సరాల పదవీ కాలంలో 20 రాష్ట్రాలు, 1 కేంద్రపాలిత ప్రాంతం(పుదుచ్చేరి)లో ఎన్నికలు జరుగుతాయి. ఆయన పదవీ కాలంలో ఎన్నికలు బీహార్ నుంచి ప్రారంభం కానుండగా చివరి ఎన్నికలు మిజోరాంలో జరుగుతాయి. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కొత్తగా నియమితులైన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ మాట్లాడుతూ జాతి నిర్మాణంలో మొదటి అడుగు ఓటు వేయడమేనని అన్నారు. అందువల్ల 18 సంవత్సరాలు నిండిన ప్రతి భారతీయ పౌరుడు ఓటరుగా మారాలన్నారు. ఓటర్లు ఎన్నికల్లో తప్పకుండా ఓటు వేయాలన్నారు. భారత రాజ్యాంగం, ఎన్నికల చట్టాలు, నియమాలు, దాని జారీ చేయబడిన సూచనల ప్రకారం.. భారత ఎన్నికల సంఘం ఓటర్లతో ఉందని ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. భారత 26వ సీఈసీగా ఉన్న కాలంలో జ్ఞానేష్ కుమార్ ఈ ఏడాది చివరలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలను, 2026లో కేరళ, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలను పర్యవేక్షిస్తారు. అదే విధంగా 2026లో జరగనున్న తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలను ఆయన పర్యవేక్షిస్తారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ బాధ్యతలు స్వీకరించినందుకు ఎన్నికల కమిషనర్ సుఖ్బీర్ సింగ్ సంధు అభినందనలు తెలిపారు.

## 21 ఏళ్లుగా ఊపిరితిత్తుల్లో ఇరుక్కుపోయిన పెన్ క్యాప్

వచ్చాయి. దీంతో ఆ యువకుడు ఆస్పత్రికి వెళ్లాడు. వైద్య పరీక్షలు చేసిన డాక్టర్ల మైండ్ బ్లాంక్ అయింది. అతని ఊపిరితిత్తుల్లో ఓ పెన్ క్యాప్ ఉన్నట్లు గుర్తించారు. కరీంనగర్ ప్రాంతానికి చెందిన ఆ 26 ఏళ్ల యువకుడు తనకు ఐదేళ్ల వయసు ఉన్నప్పుడు ఆడుకుంటూ పెన్ క్యాప్ మింగేశాడు. ఇటీవల తీవ్ర అనారోగ్యం కారణంగా కొండాపుర్ లోని కిమ్స్ ఆస్పత్రికి వైద్యపరీక్షల కోసం వెళ్లాడు. కానీ వైద్యులు సీటీ స్కాన్ తీసి ఆయన ఊపిరితిత్తుల్లో ఏదో గడ్డ లాంటిది ఉందని అందువల్లనే ఊపిరితీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నాడని గ్రహించారు. ఇదే విషయాన్ని కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రి కన్సల్టెంట్ క్లినికల్, ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ శుభకర్ నాదెళ్ల ధ్రువీకరించారు. మొదట తన వద్దకు పేషంట్ వచ్చినప్పుడు ఇలా 21 ఏళ్ల క్రితం క్యాప్ మింగానని చెప్పాడు. అయితే మలంలో పోయి ఉంటుందిలే అని అనుకున్నానని తనకు చెప్పాడని డాక్టర్శుభకర్వివరించారు. ఇక సర్జరీ తప్పదని భావించిన డాక్టర్ శుభకర్ దాదాపు 3 గంటలపాటు శ్రమించి సర్జరీని విజయవంతం చేశారు. ఆ పెన్ క్యాప్ ను ఊపిరితిత్తుల నుంచి తీసేశారు. ఈ మేరకు చిన్నపిల్లలు ఆటలు ఆడేటప్పుడు కనిపెడుతూ ఉండాలని డాక్టర్ శుభకర్ తెలిపారు. ఏదైనా సమస్య ఏర్పడితే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

## రోడ్లు సల సల

ఓతంలో అయితే ఉక్కపోత వాతావరణం మొదలయింది. రోజుకు మూడు సార్లు స్నానం చేయకపోతే శరీరం నుంచి వచ్చే చెమటతో దుర్వాసన వచ్చే పరిస్థితులున్నాయి. సముద్రతీరానికి దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, ఉక్కపోతతో పాటు ఫిబ్రవరి నెలలోనే ఎండల తీవ్రత మొదలయింది. ఇది ఆరంభం మాత్రమేనని, రానున్న కాలంలో మరింత తీవ్రమవుతాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.ఉదయం ఏడు గంటల నుంచి ఎండల తీవ్రత ఎక్కువుతుండటంతో పనులకు వెళ్లే వారు సయితం ఇబ్బందులు పడుతున్నారు. కూలీ పనులకు వెళ్లే వారి దగ్గర నుంచి ఆటో కార్మికులు, చిరు వ్యాపారులు నడి ఎండలో ఫిబ్రవరిలోనే వ్యాపారాలు చేసుకోలేకపోతున్నారు. కొందరు అలసటతో ఇంటి దారి పడుతున్నారు. చెమట తీవ్రంగా కారుతుండటంతో నీరసానికి గురవుతున్నారని, తగినంత నీటిని వీలయినంత వరకూ ఎక్కువ సార్లు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. తగినంత మజ్జిగ తీసుకోవడంతో పాటు కొంత ఖర్చయినా కొబ్బరి నీళ్లు సేవించడం మంచిదని, దీనివల్ల డీ హైడ్రేషన్ కు గురి కాకుండా ఉంటారని, తద్వారా అనేక రోగాల నుంచి బయటపడతారని చెబుతున్నారు.రానున్న మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. సాధారణ ఉష్ణోగ్రతల కంటే గరిష్టంగా నాలుగు డిగ్రీలు అధికంగా నమోదయ్యే అవకాశముందని హెచ్చరిస్తున్నారు. ఉదయం వేళ కొంత చలిగాలులు వీస్తున్నప్పటికీ ఏడు గంటలు దాటితే మాత్రం భానుడు భగభగ మండి పోతున్నాడు. ఏపీ, తెలంగాణలో 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నెలాఖరుకు నలభైకి చేరుకునే అవకాశాలు కూడా లేకపోలేదు. అందుకే ప్రయాణాలు చేసే వారు సయితం తగిన జాగ్రత్తలు పాటిస్తే మంచిదని సూచిస్తున్నారు. వీలుంటే వాయిదావేసుకుంటే మంచిదని కూడా చెబుతున్నారు. సొంత వాహనాల్లో దూర ప్రయాణాన్ని వీలయినంత వరకూ తగ్గించడం మంచిదని కూడా అంటున్నారు.

## తెలంగాణ ప్రజల కోసం పోరాడేదే బీఆర్ఎస్

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి తన చారిత్రక బాధ్యతను నిర్వహించిన తెలంగాణ ప్రజల పార్టీ బీఆర్ఎస్ అని కేసీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ సమాజంలోని అన్ని వర్గాలను చైతన్య పరుస్తూ, తెలంగాణ అస్తిత్వ పటిష్టతకు కృషి చేస్తూ, గతం గాయాలనుండి కోలుకున్న తెలంగాణాను తిరిగి అవే కష్టాలపాలు కాకుండా, గత దోపిడీ వలసవాదుల బారిన పడకుండా, తెలంగాణ ప్రజలకు శాశ్వత విజయం అందించే దిశగా సమస్త పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. పార్టీని గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి దాకా పటిష్ట నిర్మాణం చేసి అటు పార్టీ విజయాన్ని ఇటు తెలంగాణ ప్రజల శాశ్వత విజయం కోసం సమాంతరంగా పని చేయాలని పాల్గొన్న నాయకులకు అధినేత దిశా నిర్దేశం చేశారు.

### పార్టీ సభ్యత్వం ఇంచార్జ్ గా హరీష్ రావు

పార్టీ ఆవిర్భవించి 25వ సంవత్సరం లోకి అడుగిడుతున్న నేపథ్యంలో సిల్వర్ జూబ్లీ వేడుకలను ఏడాది కాలం పాటు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థి, మహిళా సహా పార్టీ అనుబంధ విభాగాలను మరింత పటిష్ట పరచాలన్నారు. అందుకోసం సీనియర్ పార్టీ నేతలతో కూడిన సబ్ కమిటీ లను ఏర్పాటు చేసి కార్యాచరణ ప్రారంభించాలని కేసీఆర్ ఆదేశించారు. నియోజకవర్గ స్థాయిలో పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంబించాలని నిర్ణయించారు. సభ్యత్వ కార్యక్రమానికి ఇంచార్జ్ గా హరీష్ రావును నియమించారు.

### ఉపఎన్నికలు ఖచ్చితంగా వస్తాయి

తెలంగాణలో ఖచ్చితంగా ఉపఎన్నికలు వస్తాయని కేసీఆర్ జోస్యం చెప్పారు. సాధించుకున్న తెలంగాణ వెనక్కి పోతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ వేగంగా పడిపోతోందని మళ్లీ ఆ పార్టీ లేచే ప్రశ్నే లేదన్నారు. పాతికేళ్ల స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ పట్టు నిలుపుకునేలా ప్రయత్నించాలన్నారు. బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో కేసీఆర్ ప్రసంగించిన తర్వాత పార్టీల నేతలతో సంభాషించారు. వారు చెప్పిన మాటల్ని ఆలకించి వాటికి సమాధానాలిచ్చారు. ఈ క్రమంలోనే కొంత మంది పార్టీ నేతలు చేసిన వ్యతిరేక ప్రచారం గురించి ప్రస్తావించారు. ఆ పార్టీ నేతలు ఎవరు అన్నదానిపై కేసీఆర్ కు సమాచారం ఉన్నా ఆయన నేరుగా ఎవరి పేరు పెట్టి చెప్పలేదని తెలుస్తోంది. పార్టీ కార్యకవర్గానికి భవిష్యత్ పై నమ్మకం కల్పించి పోరాటాల దిశగా దిశానిర్దేశం చేసేందుకు ఈ సమావేశాన్ని కేసీఆర్ ఏర్పాటు చేశారని భావిస్తున్నారు.

## ఢిల్లీ కొత్త సీఎంగా రేఖా గుప్త

ఎదురైంది. తాజాగా ఢిల్లీ బీజేపీ ఎమ్మెల్యేలు సమావేశమై రేఖా గుప్తాను ఏకగ్రీవంగా బీజేపీ శాసనసభా పక్ష నేతగా ఎన్నుకున్నారు.

దీంతో ఢిల్లీకి సుష్మా స్వరాజ్, షీలా దీక్షిత్, ఆతిశీ తర్వాత నాలుగో మహిళా సీఎంగా పగ్గాలు చేపట్టబోతున్నారు. నేడు మధ్యాహ్నం 12.30 నిమిషాలకు ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం నిర్వహించనున్నారు. ఢిల్లీ సీఎంగా రేఖా గుప్తాతోపాటు మరో ఆరుగురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణం చేయనున్నట్లు తెలుస్తోంది.విద్యార్థి దశ నుంచే బీజేపీలో చురుగ్గా పాల్గొన్న రేఖా గుప్తా కౌన్సిలర్‌గా రాజకీయ జీవితం ప్రారంభించారు. ఎమ్మెల్యేగా రెండుసార్లు పోటీ చేసినా ఓటమి పాలయ్యారు. ఈ నేపథ్యంలోనే తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొంది నేరుగా ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోనున్నారు. ఢిల్లీ యూనివర్సిటీ ప్రెసిడెంట్‌గా రేఖా గుప్తా రెండుసార్లు ఎన్నికయ్యారు. ఢిల్లీ పీతంపురా నుంచి కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఢిల్లీ మేయర్‌గా పనిచేశారు. ఈ క్రమంలోనే విజేంద్ర గుప్తాను అసెంబ్లీ స్పీకర్‌గా నియమించారు.ఢిల్లీలోని షాలీమార్ బాగ్ శాసనసభ నియోజకవర్గం నుంచి 2015, 2020 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసినా రేఖా గుప్తా.. సమీప ప్రత్యర్థి ఆప్‌కు చెందిన బందనాకుమారి చేతిలో ఓటమి పరాజయం పాలయ్యారు. ఇక ఇటీవలి ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుంచి పోటీ చేసి బందనాకుమారిని 29వేలకు పైగా ఓట్ల తేడాతో ఓడించారు. రేఖా గుప్తా బీజేపీలో ఎన్నో కీలక బాధ్యతలను నిర్వర్తించారు. బీజేపీ ఢిల్లీ శాఖ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.

## మాకు అధికారమే పరమావధి కాదు

ఉత్సవంగా నిర్వహించాలని తమ పార్టీ నిర్ణయించిందని వెల్లడించారు. ప్రజా ఉద్యమాలు, విప్లవ పోరాటాలకు పురిటిగడ్డ మన తెలంగాణ అని ఆయన అన్నారు. తెలంగాణ పోరాటంలో ప్రాణత్యాగాల గురించి పార్టీ సమావేశంలో గుర్తు చేసుకున్నట్లు చెప్పారు.

రానున్న కాలంలో పార్టీ కార్యక్రమాలపై కేసీఆర్ దిశా నిర్దేశం చేశారని ఆయన తెలిపారు. తెలంగాణ అస్తిత్వం, ప్రజల ప్రయోజనాలే తమ పార్టీకి ముఖ్యమని కేటీఆర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ రజతోత్సవాలు ఏడాది పాటు నిర్వహించాలని నేటి సమావేశంలో నిర్ణయించామని అన్నారు. ఉత్సవాల నిర్వహణకు సీనియర్ నేతల ఆధ్వర్యంలో త్వరలో కమిటీలను ఏర్పాటు చేయబోతున్నామని ఆయన తెలిపారు.

## చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదు జగన్‌కు దమ్ములేదు

వేశారు.

### అసెంబ్లీకి వెళ్లకుంటే రాజీనామా చేయండి

ప్రెస్ మీట్‌లు పెట్టి పురాణం అంతా చెప్పే తీరిక జగన్‌కి దొరుకుతుంది కానీ అసెంబ్లీలో పాలకపక్షాన్ని నిలదీసే ధైర్యం లేదని అన్నారు షర్మిల. ప్రజలు 11 మందిని గెలిపిస్తే శాసనసభకు రాకుండా మారం చేసే వైసీపీ అధ్యక్షుడికి, పార్టీ ఎమ్మెల్యేలకు ప్రజల మధ్య తిరిగే అర్హత లేదని అభిప్రాయపడ్డారు. ప్రజల సమస్యల మీద మాట్లాడే నైతికత అసలే లేదన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు ఈ సారైనా అసెంబ్లీకి వెళ్ళాలని డిమాండ్ చేశారు. సభా వేదికగా కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. ఈసారి కూడా అసెంబ్లీకి వెళ్ళే దమ్ము లేకుంటే వైసీపీ ఎమ్మెల్యేలు వెంటనే రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు.

## గ్రీన్ ఫీల్డ్ హైవే భూసేకరణ రచ్చ

ప్రభుత్వం అన్నట్టు గ్రీన్ ఫీల్డ్ హైవే భూసేకరణ పరిహారం విషయంలో జరుగుతున్న రచ్చ అంతా ఇంతా కాదు. రైతులు నిరసనలు చేస్తూ భూసేకరణను అడ్డుకుంటున్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం తక్కువ పరిహారం నిర్ణయించటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వారు వాపోతున్నారు. అయితే నేషనల్ హైవే కోసం సేకరించే భూములను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని, ఇందుకు కేంద్రం డబ్బులు చెల్లిస్తుంది.

### రైతుల డిమాండ్ ఇదే

రాష్ట్రప్రభుత్వం సరైన ధర నిర్ణయించి కేంద్రానికి పంపాలని రైతులు కోరుతున్నారు. అయితే కేంద్రమే పరిహారం విషయంలో నిర్ణయం తీసుకుందని రాష్ట్ర ప్రభుత్వం , రాష్ట్రమే రైతులకు అన్యాయం చేస్తుందని కేంద్రం చెప్తున్న పరిస్థితి ఉంది. ఈ క్రమంలో రాష్ట్రంలోని రేవంత్ సర్కార్ తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

### పరిహారం విషయంలో కేంద్రంపై అపవాదు వేయడం సమంజసం కాదు

తెలంగాణ రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, లేదంటే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని చెప్తున్న రైతాంగానికి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తమ మద్దతు తెలిపారు. భూసేకరణ కోసం కలెక్టర్లతో కమిటీ వేసి ప్రాంతాలవారీగా వాస్తవ ధరలు నిర్ణయించాలని, ఆ నివేదికను కేంద్రానికి పంపాలని వారు చెప్తున్నా రాష్ట్రం మాత్రం ఈ విషయంలో స్పందించటం లేదని అంటున్నారు.

### పరిహారం నష్టం కలగకుండా ఇస్తేనే భూములు ఇస్తామన్న రైతులు

తెలంగాణా రాష్ట్రంలో హైవేల నిర్మాణం కోసం కేంద్రం దూకుడుగా ముందుకు వెళ్తుందని బీజేపీ నేతలు చెప్తుంటే, ఏ ఇబ్బంది అయినా కేంద్రం వల్లే వస్తుందని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు కాంగ్రెస్ నేతలు. ఏది ఏమైనా తెలంగాణా ప్రగతి కోసం నిర్మాణం చేస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే విషయంలో రెండు ప్రభుత్వాల మధ్య వివాదం పరిష్కారం కావాలని, రైతులకు నష్టం కలగకుండా చూడాలని భూములను ఇవ్వం అంటున్న రైతులు కోరుతున్నారు. పరిహారం నష్టం కలగకుండా ఇస్తేనే భూములు ఇస్తామని అంటున్నారు.

## ఎల్ఆర్ఎస్‌పై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

క్రమబద్ధీకరణకూ కూడా అవకాశం ఇస్తోంది తెలంగాణ ప్రభుత్వం. ఎల్ఆర్ఎస్ పథకం అమల్లో వేగం పెంచేందుకు 25 శాతం రాయితీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం మార్చి 31 వరకూ అవకాశం ఇచ్చింది.మరోవైపు వ్యక్తిగతంగా ప్లాట్లు కొనుగోలు చేసి, రిజిస్టర్ చేసుకోని వారికి, లేఅవుట్లో పెద్ద సంఖ్యలో విక్రయం కాకుండా ఉన్న ప్లాట్ల రెగ్యులరైజేషన్?కు అవకాశం ఇస్తున్నారు. ప్లాట్లు కొనుగోలు చేసి సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ కలిగిన వారికి కూడా ఎల్ఆర్ఎస్‌కు అవకాశం ఇస్తున్నారు. వీరికి కూడా 25 శాతం రాయితీ కల్పించాలని మంత్రులు నిర్ణయం తీసుకున్నారు.

ఎల్ఆర్ఎస్ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద ఫీజు చెల్లించి ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మంత్రులు సూచించారు. మరోవైపు ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి తెలంగాణ ప్రభుత్వానికి సుమారుగా 25.67 లక్షల దరఖాస్తులు అందాయి. వీటిలో ప్లాట్లకు సంబంధించినవి 25.53 లక్షల దరఖాస్తులు ఉన్నాయి., లేఅవుట్ల దరఖాస్తులు 0.13 లక్షలు ఉన్నట్లు అధికారులు చెప్తున్నారు.మరోవైపు నాలుగేళ్ల నుంచి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న వారిని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం ఈ అవకాశం కల్పించింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రులు విజ్ఞప్తి చేశారు. మరోవైపు ఈ పథకాన్ని రోజువారీగా సమీక్షించాలని నిర్ణయించారు. నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో జాగ్రత్తగా ఉండాలని అధికారులకు ఇప్పటికే ఆదేశించారు. నిషేధిత భూముల జాబితా విషయంలో కఠినంగా వ్యవహరించాలని మంత్రులు స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ఎల్ఆర్ఎస్ పథకాన్ని సులభతరం చేయాలన్న తెలంగాణ ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్దే ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మంత్రులు సూచించారు.

## హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలు

చేస్తున్నారు. ఈ క్రమంలోనే మిస్ వరల్డ్ పోటీల నిర్వాహకులు బుధవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. హైదరాబాద్‌లో ఈ మిస్ వరల్డ్ ప్రారంభ, ముగింపు వేడుకలు అంగరంగా వైభవంగా జరగనున్నాయి.ఇక ఈ మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు 120 దేశాల నుంచి యువతులు హైదరాబాద్ రానున్నారు. భారత్‌లో మిస్ వరల్డ్ పోటీలు జరిగి దాదాపు 30 ఏళ్లు కావస్తోంది. ఈ క్రమంలోనే ఈ ప్రపంచ సుందరి అందాల పోటీలను 28 ఏళ్ల తర్వాత భారత్‌లో నిర్వహిస్తుండటం గమనార్హం. 1951లో యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఎరిక్ మోర్లీ ఈ మిస్ వరల్డ్ పోటీలను ప్రారంభించారు. అప్పటినుంచి 74 ఏళ్లుగా ఈ ఐకానిక్ పోటీలు ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో ఏటా జరుగుతున్నాయి.

ఫెస్టివల్ బికినీ కాంటెస్ట్ అని పిలిచే ఈ కార్యక్రమానికి బ్రిటిష్ ప్రెస్ ప్రచార బాధ్యతలు నిర్వహిస్తోంది.ఇక 1951లో మొదటిసారి మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించినపుడు స్వీడన్‌కు చెందిన కెర్‌స్టిన్ కికీ హకాన్సన్ ఫస్ట్ మిస్ వరల్డ్‌గా నిలిచింది. ప్రతీ ఏటా మిస్ వరల్డ్ ఫైనల్స్‌ను పర్యవేక్షించే బాధ్యతను మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ కలిగి ఉండటంతో ఇవి ప్రపంచంలోనే అతిపెద్ద ఈవెంట్‌గా మారింది. ఈ మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా ఉన్న వికలాంగులు, వెనుకబడిన పిల్లలకు సహాయం చేసేందుకు స్వచ్ఛంద సంస్థల నుంచి విరాళాలు సేకరించి 100 కంటే ఎక్కువ దేశాల్లో సేవలు అందిస్తోంది. మరోవైపు చివరిసారి 1996లో భారత్ మిస్ వరల్డ్ పోటీలకు ఆతిథ్యం ఇచ్చింది. ఇప్పుడు 3 దశబ్దాల తర్వాత ఈ పోటీని భారత్‌లో అది కూడా తెలంగాణలో నిర్వహించనుండటం గమనార్హం. అయితే ఈ మిస్ వరల్డ్ పోటీలను మొదట ఢిల్లీలో నిర్వహించాలని భావించినా ఆ తర్వాత నిర్ణయం మార్చుకుని వాటిని హైదరాబాద్‌కు మార్చారు.

## రాష్ట్రాలకు విపత్తు సాయం

స్థాయి కమిటీ దేశంలోని ఐదు రాష్ట్రాలకు అదనపు విపత్తు సాయాన్ని అందించేందుకు ఆమోదం తెలిపింది. దీంతో ఆ 5 రాష్ట్రాల కోసం రూ.1554.99 కోట్ల నిధులను విడుదల చేసింది. గతేడాది ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల్లో విపత్తులు సంభవించాయి. ఇందుకుగానూ నరేంద్ర మోదీ సర్కార్ ఆయా రాష్ట్రాలకు విపత్తు సాయం అందించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఆకస్మిక వరదలు సంభవించడం కొండ చరియలు విరిగిపడటం లాంటి ప్రకృతి విపత్తులు జరిగిన ఒడిశా, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాలకు కలిపి మొత్తంగా ఈ రూ.1554.99 కోట్ల నిధులు రిలీజ్ చేసింది.

తాజాగా కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధుల్లో ఆంధ్రప్రదేశ్‌కు రూ.608.08 కోట్లు, తెలంగాణకు రూ.231.75 కోట్లు అందనున్నాయి. భారీ వర్షాల కారణంగా గతేడాది విజయవాడ నగరం మొత్తం అతలాకుతలం అయిన సంగతి తెలిసిందే. ఇక తెలంగాణలో ఖమ్మం, ఉమ్మడి వరంగల్ జిల్లాలో భారీ వర్షాలు, వరదలు తీవ్ర నష్టాన్ని చేకూర్చాయి. మరోవైపు త్రిపుర రాష్ట్రానికి రూ.288.93 కోట్లు ఒడిశాకు రూ.255.24 కోట్లు నాగాలాండ్‌కు రూ.170.99 కోట్లను విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ఇక గతేడాది వరదలు, విపత్తు కారణంగా నష్టపోయిన రాష్ట్రాలకు ఇప్పటికే కొన్ని నిధులు విడుదల చేయగా తాజాగా వాటికి అదనంగా మరికొన్ని నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది.ప్రకృతి విపత్తుల కారణంగా నష్టపోయిన ప్రాంతాల్లో కేంద్ర బృందాలు పర్యటించి.. నివేదికలు ఇవ్వగా తాజాగా మరో ఐదు రాష్ట్రాలకు అదనంగా నిధులను కేటాయించింది. అయితే 2024-25 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఎస్‌డీఆర్ఎఫ్‌లో భాగంగా 27 రాష్ట్రాలకు రూ.18,322.80 కోట్లు విడుదల చేసింది. అదే సమయంలో ఎన్‌డీఆర్ఎఫ్ కింద 18 రాష్ట్రాలకు రూ.4,808.30 కోట్లను మంజూరు చేసింది.

## ఆంధ్రప్రదేశ్ పాలిటిక్స్‌లో మిర్చి మసాలా

ధాన్యం రైతులు ఇబ్బంది పడ్డారని ఇప్పుడు మిర్చి రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. చంద్రబాబు వచ్చినప్పటి నుంచి రైతులను పట్టి పీడిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వ హయాంలో క్వింటా ధర రూ.21-27 వేలు పలికిందని ఇప్పుడు రూ.8-11వేలకు పడిపోయిందన్నారు.

### పథకాలు మూలన పడేశారు - జగన్

ఈ ఏడాది తెగుళ్లు కారణంగా మిర్చి పంట దిగుబడి పడిపోయిందని ఎకరాకు పది క్వింటాళ్లకు మించి రాలేదన్నారు. కౌలు రైతు పరిస్థితి మరింత దయనీయంగా ఉందన్నారు. ముఖ్యంగా కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కర్నూలు, అనంతపురం జిల్లా రైతులు మరిన్ని ఇబ్బంది పడతున్నారని ఆరోపించారు. పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి పట్టించుకోవడం లేదని జగన్ ఆరోపించారు. దీనిపై రివ్యూ కూడా చేయలేదన్నారు. రైతులకు సాయం చేయకపోగా తాము తీసుకొచ్చిన విప్లవాత్మక పథకాలు కూడా మూల పడేశారని ధ్వజమెత్తారు.

### ఘాటుగా బదులిచ్చిన ప్రభుత్వం

జగన్ చేసిన ఆరోపణలపై ప్రభుత్వం ఘాటుగా రియాక్ట్ అయ్యింది. అధికారంలో ఉన్నప్పుడు కనీసం అడుగు బయట పెట్టని వ్యక్తి ఇప్పుడు ఏదో రాజకీయం చేయడానికి బయటకు వస్తున్నారని అన్నారు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు. జగన్ చేసిన కామెంట్స్ చూస్తుంటే మానసికస్థితి సరిగా లేదని అర్థమవుతుందని ధ్వజమెత్తారు. జగన్ చెప్పే అబద్దాలు విన్న ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. జగన్‌కు పని లేకపోవడంతోనే ఇలాంటి విమర్శలు చేస్తున్నారని అన్నారు. వ్యవసాయం కోసం జగన్ చేసిందేంటని ప్రశ్నించారు. దీనికి తోడు భారీగా బకాయిలు పెట్టి వెళ్లిపోయారని మండిపడ్డారు. ఇద్దరీ ప్రజల పట్ల చిత్త శుద్ధి లేదని ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి ఎన్నికల హామీలు అమలు చేసి ప్రజలను ఆదుకోవడం తెలియడం లేదని ఆక్షేపించారు. అసెంబ్లీకి వెళ్లి ప్రభుత్వాన్ని నిలదీసే సత్తా జగన్‌కు లేదని మండిపడ్డారు.

## మెరిట్ ఆధారంగానే వీసీలను నియమించాం

ఉన్నత విద్య కీలక పాత్ర పోషిస్తోందన్నారు. గత పాలనలో రాజకీయ ప్రభావం, లాబీయింగ్ వీసీల నియామక ప్రక్రియ బలహీనపడిందని విమర్శించారు. తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెరిట్ ఆధారిత వ్యవస్థ విజ్ఞాన కారణానికి సేవ చేయడానికి అర్హులైన వ్యక్తులను నియమించేలా చేస్తుందన్నారు.

### వైస్-ఛాన్సలర్‌గా ఎస్టీ మహిళ

సామాజిక న్యాయాన్ని ప్రోత్సహిస్తున్నామని సీఎం తెలిపారు. ఈ విధానం ఇప్పటికే ఫలితాలను అందిస్తోందన్నారు. మొట్టమొదటిసారిగా ఎస్టీ మహిళ, ప్రొఫెసర్ ప్రసన్నశ్రీ వైస్-ఛాన్సలర్‌గా నియమితులయ్యారన్నారు. ఇది విద్య, సామాజిక న్యాయానికి గర్వకారణమైన మైలురాయిగా సీఎం పేర్కొన్నారు. కొత్తగా నియమితులైన వైస్ ఛాన్సలర్లందరినీ ఆయన అభినందించారు. విద్య విజ్ఞానాన్ని అభివృద్ధి చేయడంలో వారి పదవీకాలం విజయవంతం కావాలని 'ఎక్స్' వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు.

### మొదటి విడతగా తొమ్మిది వీసీ పోస్టులు

విశ్వవిద్యాలయాలకు ఉపకులపతుల ఎంపిక కోసం దాదాపు ఆరు నెలలపాటు మంత్రి నారా లోకేశ్ కసరత్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని 17 వర్సిటీల వీసీలు స్వచ్ఛందంగా పదవీ విరమణ చేశారు. ఈ స్థానాల భర్తీ కోసం ప్రభుత్వం ఇటీవల ప్రకటన విడుదల చేసింది. అన్నింటికి కలిపి 2వేల దరఖాస్తులు రాగా, 512 మందికిపైగా అభ్యర్థులు పోటీ పడ్డారు. వీటన్నింటిని వడపోసి మొదటి విడతగా తొమ్మిది వీసీ పోస్టులను భర్తీ చేస్తూ మంగళవారం ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులిచ్చిన విషయం తెలిసిందే. కొత్తగా నియమితులైన వీసీలలో నలుగురు ఇంజినీరింగ్, ముగ్గురు సైన్స్, ఇద్దరు సోషల్ సైన్స్ విభాగాల్లో ఆచార్యులు, నిపుణులు ఉన్నారు. సామాజికవర్గాల వారీగా చూస్తే నలుగురు ఓసీలు, ముగ్గురు బీసీలు, ఎస్సీ, ఎస్టీలు ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన వసతులు కల్పించాలి

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**

**రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు సన్నద్ధత పై అధికారులతో సమీక్షించిన కలెక్టర్**



సిరిసిల్ల( ప్రశ్న న్యూస్) ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన వసతులు కల్పించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు సన్నద్ధత పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు అవసరమైన మొత్తం వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని, టార్పాలిన్ కవర్లు మరోసారి వినియోగించేందుకు గల అవకాశాలను పరిశీలించాలని, మనకు అవసరమైన వసతుల ఇండెంట్ పక్కగా నమోదు చేయాలని అన్నారు. టార్పాలిన్ కవర్లు, గని బ్యాగులు వేయింగ్ యంత్రాలు, తేమ శాతం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు వినియోగించుకునేందుకు వీలుగా ఎంత మన దగ్గర అందుబాటులో ఎన్ని ఉన్నాయో నివేదిక అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. యాసంగి కోతలకు ముందే హార్వెస్టర్లతో సమావేశం నిర్వహించి సమగ్ర కోతల ప్రణాళిక తయారు చేయాలని అన్నారు. హార్వెస్టర్లు అవసరమైన జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.దాన్యం కేంద్రముల వద్ద అవసరమైన అన్ని వసతులు పకడ్బందీగా ఉండేలా కార్యాచరణ తయారు చేయాలని కలెక్టర్ తెలిపారు.జిల్లాలో ఉన్న మిల్లర్ల బిల్డింగ్ కెపాసిటీ పెంచాలని, మిల్లింగ్ సామర్థ్యం మేరకు జరగాలని , నిర్దేశిత సమయంలో భారత ఆహార సంస్థకు సరఫరా పూర్తి చేయాలని, ప్రతిరోజు కనీసం 16 గంటల వరకు మిల్లింగ్ జరిగేలా చూడాలని అన్నారు. రైస్ మిల్లుల వద్ద ఉన్న స్టాక్ ను తనిఖీ చేయాలని, అక్రమ దాన్యం రవాణాను అడ్డుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి రైస్ మిల్లర్ బ్యాంక్ గ్యారెంటీ సమర్పించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. 2022-23 రబీ రైస్ వేలం వేసేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. ఖరీఫ్ 2023-24 సిఎంఆర్ ఎస్ డెలివరీ పెండింగ్ లేకుండా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి వసంత లక్ష్మి, డి.ఎం. సివిల్ సప్లై అధికారులు రజిత, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాజమండ్రి గామన్ బ్రిడ్జిపై కారు దగ్ధం

**రాజమండ్రి :** గామన్ బ్రిడ్జిపై కారు దగ్ధం అయింది. కొవ్వూరు వైపు నుండి రాజమండ్రి వస్తుండగా కారులో మంటలు వ్యాపించాయి.

కారులో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించాయి. ఘటనలో కారు యజమానికి స్వల్ప గాయాలు అయ్యాయి. కారు పూర్తిగా దగ్ధమైంది. ప్రయాణికులు మంటలను ఆర్పడానికి. ప్రయత్నించారు. అగ్నిప్రమాదం సంభవించిన సమయంలో కారులోనే ఉన్న యజమాని, సురక్షితంగా బయటపడ్డాడు.

# సంపాదకీయం


## నివేదికలే కానీ.. అమలు ఎక్కడ

విద్యా సంవత్సరంలో విద్యార్థులకు పరీక్షల కాలం వచ్చేసింది. ఒకవైపు పిల్లలకు పరీక్షల టెన్షన్ పెరుగుతుం టే, మరోవైపు వారి తల్లిదండ్రులలో మాత్రం టెన్షన్ రెండింతలవుతుంది. పిల్లల పరీక్షలతో పాటు, రాబోయే విద్యా సంవత్సరంలో ప్రత్యేకించి ప్రయివేట్ పాఠశాలల్లో చెల్లించాల్సిన ఫీజులపై ఆందోళనతో పేరెంట్స్ ఇప్పటి నుండే సతమతమవుతున్నారు. ఈ టెన్షన్లు ఏటా షరామామూలే అయినా ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం ప్రయివేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్ర ణ కోసం ముందడుగు వేస్తుండడంతో పేరెంట్స్ కొంత ఆశాదృక్పథంతో ఉన్నారు. ప్రయివేట్ పాఠశాలల్లో అడ్డూ అదుపు లేని ఫీజుల కట్టడి కోసం విద్యా కమిషన్ చేసిన సిఫార్సులను చట్టం రూపంలో తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తుందనే వార్తలు కాస్త ఊరట కలిగిస్తున్నాయి.విజ్ఞానం, విలువల కంటే మార్కులకే ప్రాధాన్యీతిస్తున్న ప్రస్తుత కాలమాన పరిస్థితుల్లో ప్రయివేట్ స్కూళ్లకు ఆదరణ పెరి గింది. తమ కంటే తమ పిల్లల భవిష్యత్ మరింత మెరుగ్గా ఉండాలని కోరుకునే తల్లిదండ్రులు, వారికి తామిచ్చే ప్రధానమైన ఆస్తి మంచిగా చదివించడమే అనే భావనతో ఎంత ఖర్చుకైనా వెనుకాడడం లేదు. ఈ బలహీనతను ఆసరాగా చేసుకొ ని కొన్ని ప్రయివేట్ పాఠశాలలు ముక్కుపిండి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ఘటనలు నిత్యం వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఉన్న సుమారు 11,500 ప్రయివేట్ స్కూళ్లల్లో ఫీజుల నియంత్రణ కోసం మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి నేతృత్వంలోని విద్యా కమిషన్ 'తెలంగాణ ప్రయివేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ ముసాయిదా బిల్లు-2025' పేరిట జనవరి 24న పలు సిఫా ర్సులతో ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఈ బిల్లును చట్టం చేయాలని ప్ర భుత్వ వర్గాలు యోచిస్తున్నట్టు వార్తలు రావడం స్వాగతించాల్సిన పరిణామం.మౌలిక వసతులు లేమితో ఇరుకైన భ వనాల్లో, క్రీడా ప్రాంగణాలు లేకుండా తరగతి గదుల్లో పరిమితికి మించి విద్యార్థుల తో బోధన సాగిస్తున్న ప్రయివేట్ పాఠశాలల్లో విద్యావ్యవస వ్యాపార వస్తువుగా మారిన నేపథ్యంలో ఈ కమిషన్ అనేక సూచనలు చేసింది. పే స్కూల్స్, టెక్నో స్కూల్స్, ఇంటర్నేషనల్, ఈ-టెక్నో, ఒలంపియాడ్ వంటి ఆకర్షణీయమైన పేర్లతో భారీగా ఫీజులు వసూలు చేస్తున్న విద్యా సంస్థలను కట్టడి చేయడానికి విద్యా కమిషన్ క్షేత్రస్థాయిలో పలు విద్యా సంస్థల యాజమాన్యాలతో, పేరెంట్స్ కమిటీలతో, విద్యావేత్తలతో, నిపుణులతో చర్చించడమే కాక, ఇతర రాష్ట్రాల్లోని విధి విధానాలను కూడా పరిశీలించి ప్రభుత్వానికి విలువైన సూచనలను అందించింది. రాష్ట్రంలోని ప్ర యివేట్ విద్యాసంస్థలు వాటి స్థాయిని బట్టి ఏడాదికి రూ.10 వేల నుండి రూ.20 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నట్టు ఈ కమిటీ దృష్టికి వచ్చింది. గతంలో ఫీజుల ని యంత్రణ కోసం ప్రభుత్వం జీవో జారీ చేసి నా న్యాయపరమైన సమస్యలతో ప్రక్రియ ఆగిపోవడంతో ప్రయివేట్ పాఠశాలల ఆగడాలకు అంతే లేకుండా పోయిందని, గతం లో తిరుపతిరావు కమిటీ సిఫార్సులను ప్ర యివేట్ పాఠశాలలు తుంగలో తొక్కుతు న్నా పర్యవేక్షణ కరువైందని, విద్యా కమిటీని బంధనలను విద్యా సంస్థలు అటకెక్కించినా అడిగే నాథుడే లేరని గుర్తించిన కమి షన్ ప్రభుత్వానికి సలహాలు, సూచనలు చేసింది.తెలంగాణలో ప్రయివేట్ పాఠశాలలు అధికంగా వసూలు చేస్తున్న ఫీజుల ని యంత్రణకు ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో ఒక రెగ్యులేటరీ కమిషన్, జిల్లా స్థాయిల్లో ప్రత్యేక రెగ్యులేటరీ కమిషన్లు ఏర్పాటు చేసి వాటికి చట్టబద్ధత కల్పించాలనే ప్రధానమై న సిఫార్సు చేసింది. రాష్ట్ర స్థాయి కమిషన్ చైర్మన్‌గా సుప్రీం కోర్టు/హై కోర్టు రిటైర్డ్ జడ్జి లేదా రిటైర్డ్ ఐఏఎస్ అధికారిని నియమించాలని చెప్పింది. పాఠశాల యాజమా న్యాల ప్రతినిధులను, రిటైర్డ్ ప్రొఫెసర్లను, విద్యావేత్తలను, విద్యా శాఖలో పనిచేసి రిటైర్డ్ అయిన ఉన్నతాధికారిని, ఒక చార్టెర్డ్ అకౌంటెంట్‌ను సభ్యులుగా నియమించా లి. గ్రేటర్ పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాల్లోని పాఠ శాలల ఫీజులను స్టేట్ ఫీజు రెగ్యులేటరీ కమిషన్, మిగత జిల్లాల్లో ఫీజుల ఖరారు కోసం కలెక్టర్ ఆధ్వర్యంలో డీఎఫ్ఆర్‌సీ ఏర్పాటు చేసి బాధ్యతలు అప్పగించాలని కమిషన్ చెప్పింది.ప్రయివేట్ పాఠశాలలను 5 కేటగిరీలు గా విభజించి, వాటికి వేర్వేరు ఫీజులు ఖ రారు చేయాలని కమిషన్ సూచించింది. ఆయా పాఠశాలలకు ఉన్న స్థలం, ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్, డైనింగ్ హా ళ్లు, క్రీడా స్థలం, ఇతర సౌకర్యాల ఆధారం గా కేటగిరీలు, ఫీజులు నిర్ధారించాలని కమిషన్ పేర్కొంది. ఖరారు చేసిన ఫీజుల వివ రాలను పాఠశాల వెబ్‌సైట్లలో పెట్టి అంతే తీసుకోవాలి.మేనేజ్‌మెంట్లు అడ్మిషన్ ఫీజులు వసూలు చేయకుండా, ట్యూషన్ ఫీజును మాత్రమే తీసుకోవాలని కీలకమై న సిఫార్సు చేసింది. ఎప్పటికప్పుడు ఫీజులకు సంబంధించిన ఆడిట్ నివేదికలను కూడా బహిర్గతం చేయాలని కమిషన్ కీలక సూచన చేసింది.నిర్దేశించిన ఫీజు కంటే అధికంగా వసూ లు చేసే విద్యా సంస్థలపై వెంటనే విచారణ జరిపి మొదటిసారి రూ.లక్ష జరిమానా వి ధించాలి.

రెండోసారి ఆ సంస్థ నుండి అదే తప్పిదం పునరావృతమైతే రూ.2 లక్షలు, మూడోసారి రూ.5 లక్షల జరిమానా వే యాలి. అయినా మార్పు రాకపోతే ఆ పా ఠశాల అనుమతులను రద్దు చేయాలనే క ఠినమైన సిఫార్సులను కమిషన్ ప్రభుత్వానికి సూచించింది. పాఠశాలలో ఉండే గ్రం థాలయం, ల్యాబ్స్, కంప్యూటర్ ల్యాబ్ సౌ కర్యాలతో పాటు టీచర్ల విద్యార్హతలు, పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల సంఖ్య, పాఠశాల నిర్వహణకు అయ్యే ఖర్చుల ఆ ధారంగా ఫీజులు ఉండాలని కమిషన్ స్ప ష్టం చేసింది. అధికంగా ఫీజులు వసూలు చేసే అంశమే కాకుండా విద్యా ప్రమాణాలను పరిరక్షించడం, ఉపాధ్యాయుల సా మర్థ్యం పెంపు, పాఠశాలలపై పర్యవేక్షణ, తనిఖీలు చేపట్టడం, విద్యా హక్కు చట్టం అమలు వంటి అధికారాలను కూడా కమిటీలకు ఇవ్వాలని కమిషన్ సూచించింది.ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలుగు రాష్ట్రా ల్లో ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రయివేట్ పాఠశాలలపై సరైన నిఘా లేకపోవడంతో ఫీజులపై కట్టడి లేకుండా పో యింది. ఉదాహరణకు దేశంలోని ఒక ప్ర ముఖ విద్యా సంస్థ ఉత్తరాది రాష్ట్రాల్లో వ సూలు చేసే ఫీజుల కంటే, హైదరాబాద్‌లోని తమ ఫ్రాంచైజీలలో అధిక ఫీజులు వసూలు చేస్తోంది. పిల్లల అడ్మిషన్ల కోసం ప్రయివేట్ స్కూళ్లకు వెళ్తే తల్లిదండ్రులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తూ ఇబ్బందులు పె ట్టే పద్ధతికి స్వస్తి పలకాలి. ఇప్పటికే అధిక ఫీజుల నియంత్రణతో పాటు విద్యాసంస్థ ల్లో సంస్కరణల కోసం మధ్యప్రదేశ్, గుజ రాత్ ప్రభుత్వాలు చేసిన చట్టాలు సత్ఫలితాలిస్తుండడంతో వాటిని కూడా పరిగణ లోకి తీసుకోవాలి. తెలంగాణ ప్రభుత్వం విద్యారంగంలో సమస్యల పరిష్కారానికి, సంస్కరణల కోసం 2024 జులైలో మం త్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీ తక్క ఆధ్వర్యంలో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసి పలు చర్యలు చేపట్టింది.అందరికీ అందుబాటులో ఉండాల్సిన విద్య కార్పొరేటర్ల చేతిలో ఒక వ్యాపార వస్తువుగా మారిపోవడం దురదృష్టకరం. ప్ర స్తుత పరిస్థితుల్లో చదువును కొనలేక, చదువుకోలేక ఇబ్బందులు పడుతున్న పేద, మ ధ్య తరగతి వర్గాలకు ఉపశమనం కలిగించేలా ప్రయివేట్ పాఠశాలల్లో ఫీజుల ని యంత్రణకు, విద్యా వ్యవస్థలో సంస్కరణల కోసం రాష్ట్రంలో ప్రత్యేక చట్టం చేయా ల్సిన ఆవశ్యకత ఉంది.

విద్యా కమిషన్ నివేదికపై మంత్రివర్గ ఉపసంఘం చర్చించి రా బోయే విద్యా సంవత్సరం ఆరంభం నాటి కే ఒక చట్టాన్ని తయారుచేస్తే ప్రయివేట్ పాఠశాలల దాష్టీకాల నుండి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు విముక్తులవుతారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దనే విద్యా శాఖ కూడా ఉండడంతో ప్రయివేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల కట్టడికి, విద్యా వ్యవ స్థలో సంస్కరణలకు ఆయన ప్రత్యేక చొర వ తీసుకొని చట్టం రూపొందించి వీలైనంత త్వరగా అమలు చేస్తారని ఆశతో ఎదురు చూస్తున్నా

# నేడు ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం




ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 20న నిర్వహించబడుతుంది. చట్టపరంగా ఎలాంటి వివక్షత, తారతమ్యం లేకుండా ప్రజలందరికి సమన్యాయం జరగాలని ఐక్యరాజ్య సమితి పిలుపునిచ్చిన రోజుకు గుర్తుగా ఈ దినోత్సవం జరుపుకుంటారు. పేదరికం, నిరుద్యోగం వంటి సమస్యలను అధిగమించడానికి చేయవలసిన కృషికోసం ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం జరుపుకోవాలన్న ప్రతిపాదనను 2007, నవంబరు 26న జరిగిన ఐక్యరాజ్యసమితి ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం, ఎ/ఆర్ఈఎస్/62/10 పై తీర్మానించగా 2009, ఫిబ్రవరి 20న తొలిసారిగా ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం జరుపబడింది.

**విధులు...** సామాజిక న్యాయాన్ని ప్రోత్సహించవలసిన అవసరాన్ని గుర్తించి పేదరికం, లింగ సమానత్వం, నిరుద్యోగం, మానవ హక్కులు, సామాజిక రక్షణ వంటి అనేక సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నించడం అంతర్జాతీయంగా వివిధ దేశాల మధ్య స్నేహ బాంధవ్యాలు ఏర్పాటుచేయడం, సామరస్య వాతావరణం సాధించడం, వివిధ దేశాలమధ్య సమాన ప్రాతిపదికపై సంబంధాలు నెలకొల్పడం విలువలు, స్వేచ్ఛ, వ్యక్తి గౌరవం, భద్రత, ఆర్థిక సామాజిక పురోభివృద్ధి వంటి ప్రాథమిక అంశాల విషయంలో ఎటువంటి వివక్షత పాటించకుండా సామాజిక న్యాయం అమలయ్యేలా చూడడం

# అటు భద్రాద్రి.. ఇటు పాపికొండలు

- పర్యాటక సందడి షురూ - శైవక్షేత్రాల సందర్శనకు చలో
- సిటీ టూర్.. అనంతగిరి పర్యటన
- తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రత్యేక ప్యాకేజీలు





పర్యాటక సందడి తిరిగి మొదలైంది. కోవిడ్ కారణంగా చాలా కాలంగా ఇళ్లకే పరిమితమైన నగరవాసులు కాలక్షేపం కోసం పర్యటనలకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ పర్యాటకుల అభిరుచికి అనుగుణమైన ప్యాకేజీలను రూపొందించింది. నగరంలోని చారిత్రక, పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు ఏసీ, నాన్ ఏసీ బస్సుల్లో హైదరాబాద్‌ను సందర్శించే సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది.




**ఆధ్యాత్మికం.. రమణీయం..** అనంతగిరిహిల్స్: వికారాబాద్ సమీపంలోని అద్భుతమైన పర్యాటక ప్రాంతం అనంతగిరి విహారం కోసం నగరం నుంచి ఉదయం 9 గంటలకు బయల్దేరి రాత్రి 8 గంటలకు తిరిగి చేరుకుంటారు. అనంతగిరి కొండల్లో రమణీయమైన ప్రకృతిని ఆస్వాదించడంతో పాటు, పద్మనాభస్వామి ఆలయాన్ని సందర్శించవచ్చు. ఈ టూర్ కోసం పెద్దవారికి రూ.900, పిల్లలకు రూ.720 చొప్పున చార్జీ ఉంటుంది.

**సిటీ టూరు.. బోటు షికారు..** సిటీ టూర్‌లో భాగంగా బిర్లా టెంపుల్, నిజామ్ మ్యూజియం, చౌమొహల్లా ప్యాలెస్, చార్మినార్ (బయట నుంచి మాత్రమే), జూపార్కు, తారామతి బారాదరి, గోల్కొండ తదితర పర్యాటక ప్రాంతాలను సందర్శించవచ్చు.ఈ పర్యటన కోసం ఏసీ వాహనాల్లో రూ.350, నాన్ ఏసీ వాహనాల్లో రూ.250 వరకు చార్జీ ఉంటుంది. పర్యటనలో భాగంగా టిఫిన్, భోజనం, వివిధ ప్రాంతాల్లో సందర్శన టికెట్ల రుసుము పర్యాటకులే చెల్లించాల్సి ఉంటుంది. రవాణా సదుపాయాన్ని మాత్రమే పర్యాటక అభివృద్ధి సంస్థ కల్పిస్తుంది. హుస్సేన్‌సాగర్‌లో బోటు షికారు కూడా అందుబాటులోకి తెచ్చారు.కాకతీయ రీజియన్ యాత్ర: ఉదయం 9.30 గంటలకు హైదరాబాద్ నుంచి బస్సు బయలుదేరుతుంది. 2వ రోజు రాత్రి 9 గంటలకు తిరిగి చేరుకుంటారు. కాళేశ్వరం, రామప్ప, వేయిస్తంభాల గుడి, యాదాద్రి, కీసర తదితర పుణ్యక్షేత్రాల సందర్శన ఉంటుంది. పెద్దవారికి రూ.1,550, పిల్లలకు రూ.1,320 చొప్పున చార్జీ ఉంటుంది.

**శైవ క్షేత్రాల సందర్శన..**

శాతవాహన యాత్ర: ఈ పర్యటన కోసం నగరం నుంచి ప్రతి సోమవారం ఉదయం 7 గంటలకు బయలుదేరి తిరిగి రాత్రి 10 గంటలకు చేరుకుంటారు. వేములవాడ, కొండగట్టు, ధర్మపురి తదితర ఆలయాల సందర్శన ఉంటుంది. బస్సు చార్జీ పెద్దవారికి రూ.1300, పిల్లలకు రూ.1040 చొప్పున ఉంటుంది. ఆలయ ప్రవేశ రుసుము, భోజనం వంటివి పర్యాటకులే ఏర్పాటు చేసుకోవాలి. పంచారామాలకు: ఆంధ్రప్రదేశ్‌లోని పంచారామాలకు కూడా హైదరాబాద్ నుంచి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఇది 3 రోజుల పాటు ఉంటుంది. ఉదయం 9 గంటలకు బయల్దేరి 3వ రోజు ఉదయం 7 గంటలకు తిరిగి నగరానికి చేరుకుంటారు. అమరావతి, పాలకొల్లు, భీమవరం, ద్రాక్షారామం, సామర్లకోట క్షేత్రాలను సందర్శించవచ్చు. పెద్దవారికి రూ.3,500, పిల్లలకు రూ.2,800 చొప్పున చార్జీలు ఉంటాయి.





**ప్రకృతి ఒడిలో..** పాపికొండల యాత్ర: ఇది ప్రతి శుక్రవారం ఉంటుంది. రాత్రి 8.30 గంటలకు బయలుదేరుతారు. శనివారం ఉదయం భద్రాద్రికి చేరుకుంటారు. శ్రీరాముడి దర్శనం అనంతరం పర్ణశాలకు వెళ్తారు. ఆ తర్వాత మధ్యాహ్నం పాపికొండలకు వెళ్తారు. రాత్రికి కొల్లూరులోని బ్యాంబూ హట్స్‌లో బస ఉంటుంది. మరుసటి రోజు బయలుదేరి తిరిగి నగరానికి చేరుకుంటారు. పెద్దవారికి చార్జీ రూ.4,594 ఉంటుంది. పిల్లలకు ఇందులో 80 శాతం వరకు చార్జీ ఉంటుంది.

**బుకింగ్ ఇలా..** ఈ పర్యటనల కోసం తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.ఆన్‌లైన్‌లోనే టికెట్లు బుక్ చేసుకోవచ్చు.

## కూకట్పల్లి నియోజకవర్గంలో సమస్యల పరిష్కారం కోసం జోనల్ కమిషనర్ ని కలిసిన నియోజకవర్గ ఇన్చార్జ్ బండి రమేష్



**కూకట్పల్లి( ప్రశ్న న్యూస్ )** కూకట్పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ ను కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ బుధవారం ఆయన కార్యాలయంలో కలిశారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై సుమారు గంటకు పైగా ఇరువురు చర్చించారు. ముఖ్యంగా జాతీయ రహదారితో పాటు స్థానిక రహదారుల పైన ప్రతిరోజు ఉదయం సాయంత్రం వేళ ఏర్పడే రద్దీ, ట్రాఫిక్ సమస్యలు, మురికి నీటిపారుదల పరిసర ప్రాంతాలు చెరువులు, కుంటల్లో దోమలు విపరీతంగా వ్యాపిస్తున్నాయని వాటి కట్టడికి తీసుకోవాలని చర్యలను వెంటనే చేపట్టాలని కోరారు. గత ప్రభుత్వం హయాం లో సర్దార్ పటేల్ నగర్ హస్మత్ పేట లో ఏర్పాటు చేసిన మోడల్ రైతు బజార్లు నేటికీ కూడా టిఆర్ఎస్ నాయకుల కబంధహస్తాల్లో ఇరుక్కుపోయాయని వాటిని విడిపించాలని సూచించారు. కెపి హెచ్ బి లో కట్టాల్సిన వంద పడకల ఆసుపత్రి, మూసాపేట వై జంక్షన్ లో నిర్మించాల్సిన ఫ్లైఓవర్ బ్రిడ్జి, రహదారుల విస్తరణ వీధి దీపాల ఏర్పాటు త్రాగునీరు సమస్యలతో పాటు నియోజకవర్గంలో భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలు వాటికి నిధుల విడుదల వంటి అంశాలపై బండి రమేష్ జోనల్ కమిషనర్ తో కూలంకషంగా చర్చించారు. అదేవిధంగా మలేషియా టౌన్షిప్ లోని సీనియర్ సిటిజన్స్ ను పక్కనే గల పార్కులో వాకింగ్ కు సైతం అనుమతించడం లేదన్న టౌన్షిప్ అసోసియేషన్ సభ్యుల ఫిర్యాదు పై జోనల్ కమిషనర్ స్పందించారు. సమస్య పరిష్కారం కోసం హామీ ఇచ్చారు.

## ఎం పి కాదు.యం ల్ ఏ కాదు.భరోసా సి పి ఐ పార్టీ



ఈస్ట్ గోదావరి ప్రతినిధి (ప్రశ్న న్యూస్) కొయ్యలగూడెం మండలం కుంతలగూడెం గ్రామంలో మంగళవారం ఉదయం జాతీయ ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న కూలీలపై ట్రాక్టర్ అదుపుతప్పి దూసుకు వెళ్లడంతో గ్రామానికి చెందిన అల్లే భాగ్యవతి (60) భర్త వీరబ్బులు , అనే మహిళ చనిపోవడంతో విషయం తెలుసుకున్న సిపిఐ పార్టీ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ. కృష్ణ చైతన్య , వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి. వెంకటేశ్వరరావు భాగ్యవతి కుటుంబ సభ్యులను బుధవారం కుంతల గూడెం గ్రామంలో ఆమె ఇంటి వద్ద పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చనిపోయిన మహిళ కుటుంబానికి 10 లక్షల రూపాయలు, స్వల్పంగా గాయపడిన కుటుంబాల వారికి 2 లక్షల రూపాయలు, తీవ్రంగా గాయపడిన వారికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ట్రాక్టర్ ప్రమాదం జరగడంతో భాగ్యవతి అక్కడికక్కడే మృతిచెందగా, బాసుబోయిన పోశమ్మ, చాపల.ఇమ్మెలియ , రాపాక నాగమణి లకు తీవ్ర గాయాలు కావడంతో, కొయ్యలగూడెం లో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో నాగమణి, పోశమ్మ లను చేర్పించగా, ఇమ్మెలియ పరిస్థితి విషమంగా ఉండడంతో ముందుగా జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తీసుకువెళ్లి తరువాత మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి తరలించారు. గ్రామంలో ప్రమాద సంఘటన జరగడంతో గ్రామం అంతా విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుంచే వసంతరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గొలిమే బాల యేసు, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు పాల్గొన్నారు.

## ఒంగోలు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ లో నాటుసారా నిర్మూలనపై అవగాహన సదస్సు



**ఒంగోలు (ప్రశ్న న్యూస్)** పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ లో నవోదయం 2.0 నాటుసారా నిర్మూలన పై సదస్సు అనంతరం జరిగిన అవగాహన ర్యాలీ లో ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు మరియు ఎక్సైజ్ శాఖా మంత్రివర్యులు కొల్లు రవీంద్ర , ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయా , జిల్లా మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తో పాటు దర్శి నియోజకవర్గ టిడిపి ఇంచార్జి డా గొట్టిపాటి లక్ష్మీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా లోని శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ , డా ముక్కు ఉగ్రనరసింహారెడ్డి , కందుల నారాయణ రెడ్డి ,బి ఎన్ విజయ్ కుమార్ , దామచర్ల సత్య తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా డా లక్ష్మీ మాట్లాడుతూ నాటు సారా తయారీకి స్వస్తి పలికి మంచి మార్గాన్ని ఎన్నుకోవాలన్నారు డాక్టర్ లక్ష్మీ . నాటు సారా తయారీదారుల్లో పరివర్తన వస్తే ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం జీవనోపాధి కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకుని గౌరవంగా బతకాలని సూచించారు. నాటు సారా తయారీ మానుకొని జనజీవన స్రవంతిలోకి రావాలని కోరారు. కల్తీ నాటు సారా తయారు చేయడం వల్ల పేద ప్రజలు ఆరోగ్యం దెబ్బతిని ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు.

## కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటాము: కమిషనర్



**గుంటూరు( ప్రశ్న న్యూస్ )** కార్మికుల కుటుంబాలకు గుంటూరు నగర పాలక సంస్థ తరుపున అండగా ఉంటామని, కార్మికులకు అందాల్సిన పరిహారాలు వెంటనే అందిచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల మరణించిన ప్రజారోగ్య విభాగ ఔట్సోర్సింగ్ కార్మికులు జూటూరి వెంకటేశ్వర రావు, బంగారు సింహాద్రి ల కుటుంబ సభ్యులకు ఎక్స్ గ్రేషియా చెక్ లను బుధవారం కమిషనర్ ఛాంబర్ నందు అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు నగరపాలక సంస్థ అండగా ఉంటుందన్నారు. ఇటీవల ప్రజారోగ్య విభాగంలో అవుట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు జూటూరి వెంకటేశ్వర రావు, బంగారు సింహాద్రి లు మరణించారని, వారి కుటుంబ సభ్యులకు సాధారణ మరణానికి అందే ఎక్స్ గ్రేషియా మరియు మట్టి ఖార్చుల క్రింద రూ.2 లక్షల చెక్కు లని అందించామని తెలిపారు. అలాగే నగరపాలక సంస్థ నుండి అందాల్సిన పరిహారాలు, పి.ఎఫ్. కూడా త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబందిత విభాగాధిపతులను, సూపరిండెంట్లను ఆదేశించామని తెలిపారు. కార్మికులు కూడా తమ సమస్యల పై అర్జీలు లేదా ఫిర్యాదులు తమకు అందిచవచ్చుని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# కబ్జాకు గురైన బతుకమ్మ కుంట ను కాపాడిన రేవంత్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు: హనుమంతరావు

### బతుకమ్మ కుంటలో గంగమ్మ పూజ చేసిన కాంగ్రెస్ శ్రేణులు బతుకమ్మ ఆట ఆడిన మహిళలు

### శాస్త్రోక్తంగా పూజలు చేసిన హనుమంతరావు, రోహిన్ రెడ్డి





**అంబర్ పేట (ప్రశ్న న్యూస్)** హైడ్రా ఆధ్వర్యంలో చేపట్టిన బతుకమ్మ కుంట పునరుద్ధరణ పనులు త్వరగా పూర్తి చేసి, రాబోయే బతుకమ్మ పండుగకు మహిళా సోదరీమణులు తమ బతుకమ్మలను బతుకమ్మ కుంటలో నిమజ్జనం చేస్తారని, మాజీ రాజ్యసభ సభ్యుడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వి .హనుమంతరావు, ఖైరతాబాద్ డి.సి.సి అధ్యక్షుడు అంబర్ పేట నియోజకవర్గం ఇంచార్జ్ రోహిన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి బతుకమ్మ ఆటపాటలతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వి. హనుమంతరావు మాట్లాడుతూ కబ్జా కి గురి అయిన బతుకమ్మ కుంట చెరువును పునరుద్ధరణ జరగడం, ఎంతో ఆనందదాయకం ఇన్నేళ్ల పోరాటానికి ఈ రోజు సరియైన ఫలితం దక్కిందని ఆయన అన్నారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారంతో కబ్జాలకు గురైన చెరువులను, స్థలాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించి పరిరక్షిస్తున్నందుకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా అంబర్ పేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రోహిన్ రెడ్డి మాట్లాడుతూ గత కొద్ది కాలంగా కబ్జాకి గురి అయిన బతుకమ్మ కుంట విషయాన్ని వి. హనుమంతరావు సీ.ఎం. రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకురావడం జరిగిందని, దానితో సీఎం వెంటనే స్పందించి, పరిష్కారాన్ని చేకూర్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రా పేరుతో కబ్జాలకు గురైన స్థలాలను చెరువులను పునరుద్ధరించాలన్న సంకల్పంతో రాష్ట్ర వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ వ్యాపారంతో బడా బాబులు ప్రభుత్వ స్థలాలను కబ్జాలు చేసుకొని, రియల్ ఎస్టేట్ వ్యాపారంతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన బడా బాబులకు హైడ్రా పేరు ఉంటేనే గడగడలాడుతున్నారని, కబ్జాలకు గురైన స్థలాలను పరిరక్షించడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న ఈ యొక్క కార్యక్రమం ఎంతో సఫలీకృతం అవుతుందని, ఈ సందర్భంలోనే అంబర్ పేట బతుకమ్మ కుంటలో మళ్లీ బతుకమ్మ కుంటలో నీళ్లను చూస్తున్నామంటే ఎంతో సంతోషంగా ఉందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, హనుమంతరావు కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మణ్ యాదవ్,లకపతి యాదగిరి ,జ్యోతి గౌడ్, సత్తి బాబు, శ్రీకాంత్ గౌడ్, ఉషశ్రీ , రామ్ మోహన్, మోతె రోహిత్, సత్తిబాబు,గడ్డం శ్రీధర్ గౌడ్, కోటం అనిల్, రావుల సుధాకర్, కృష్ణ గౌడ్,వెంకటేష్ గౌడ, శ్రీనివాస్ రెడ్డి, జమీర్,శశి, కిషోర్,కోట్ల కిరణ్, రాజకిరణ్ ,నిజాం, సునీల్ గౌడ్, రాకేష్ ,మహిళా నాయకులు సునీతరెడ్డి, లావణ్య, విజిత రెడ్డి, శాంతమ్మ, బతుకమ్మ కుంట నివాసులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానానికి మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్





**శ్రీకాళహస్తి (ప్రశ్న న్యూస్ )** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానానికి కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కుటుంబ సభ్యులతో విచ్చేశారు వీరిని శ్రీకాళహస్తి నియోజకవర్గం శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మరియు బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ కార్యనిర్వణాధికారి టి. బాపిరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి వారిలా ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు నిర్వహించారు కేంద్రమంత్రి కుటుంబ సమేతంగా జ్ఞాన ప్రసూనాంబ సమేత వాయు లింగేశ్వరుని దర్శించుకున్నారు. దర్శన అనంతరం ,శ్రీ మేధా గురుదక్షిణామూర్తి సన్నిధానం వద్ద కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కుటుంబ సభ్యులకు వేద పండితులు మంత్రోచ్చారణలతో ఆశీర్వాదం ఇవ్వగా శ్రీకాళహస్తి నియోజకవర్గం శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి దంపతులు శేష వస్త్రంతో సత్కరించి శ్రీ జ్ఞాన ప్రసూనాంబా సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. తాను బడ్జెట్ సమావేశాల గురించి తిరుపతిలో ప్రస్తావించడానికి తాను వచ్చానని ,అయితే తనను స్థానిక శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి ,మరియు బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ శ్రీ కాళహస్తి దేవస్థానాన్ని దర్శించుకోవడం ఆహ్వానం పలకగా, శ్రీ కాళహస్తి దేవస్థానాన్ని దర్శించుకున్నానని, అయితే బొజ్జల సుధీర్ రెడ్డి తాను అధికారంలో వచ్చిన తర్వాత శ్రీకాళహస్తిసుందరీ కారణంగా తీర్చిదిద్దడంలో ఆయన చేస్తున్న కృషి కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుందని , శ్రీకాళహస్తిలో ప్రవేశించగానే రహదారులు మరియు రహదారుల మధ్య డివైడర్ సుందరీ కారణంగా తీర్చిదిద్దడంతో నేడు శ్రీకాళహస్తి అత్యంత అద్భుతంగా గోచరిస్తుందని, శ్రీకాళహస్తి సుంద్రీకరణంగా తీర్చిదిద్దుతున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డికి ఆయన అభినందనలు తెలియజేశారు.

# సుజాత నగర్ లో ఆగని అక్రమ మట్టి దందా

## పట్టించుకోని అధికారులు



**సుజాతనగర్ (ప్రశ్న న్యూస్)** మండలంలో జరుగుతున్న అక్రమ మట్టి దందా గురించి ఫోటోలు, వీడియోలు బయటకు వచ్చినప్పటికి అధికారులు పట్టించుకోకవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పబ్లిక్ గ్రూపులలో వీడియోలు, ఫోటోలు వైరల్ అవుతున్న అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం వెనుక భారీగా డబ్బులు చేతులు మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మా ఇష్టం వచ్చినట్టు చేస్తాం అధికారులే పట్టించుకోవడం లేదు మీరెవరు మమ్మల్ని అడగడానికి అంటూ బహిరంగంగా సవాల్ విసురుతు, రాత్రి అవగానే టిప్పర్ల ద్వారా మట్టి రవాణా చేస్తుంటే రెవిన్యూ, పోలీస్ అధికారులు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. రవాణా చార్జీలను తగ్గించుకునేందుకు ఒక్కో వాహనంలో 40-50టన్నుల సింగభూపాలం మట్టిని నిత్యం పదుల సంఖ్యలో ట్రిప్పులతో పెద్ద సైజు టిప్పర్లు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ప్రధాన రహదారులు దెబ్బ తింటున్నాయి. మట్టి తరలింపునకు మైనింగ్, ఇరిగేషన్ అనుమతులు ఉన్నాయో లేదో అని చూడకుండానే అధికారులు వాహనాలను వదిలేస్తున్నారని ఆరోపణలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఓవర్లోడ్తో టిప్పర్లు నిత్యం రాకపోకలు సాగిస్తున్నా సంబంధిత రవాణా శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. కొంత మంది అధికారులు ముడుపులు తీసుకొని ఓవర్లోడ్ టిప్పర్లను చూసీచూడనట్లుగా వదిలేస్తున్నారని, ఓవర్ స్పీడ్ తో వెళ్తున్న వాహనదారుల కండ్లల్లో దుమ్ము పడుతుండడంతో పలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. . వీటి నుంచి మట్టి కింద పడుతుండడంతో ప్రమాదం జరిగే అవకాశం వుంది.రాత్రికి రాత్రి జెసిపి మరియు లారీలతో, ట్రాక్టర్లతో కొన్ని వందల ట్రిప్పులు తోలుతుంటే అధికారులకు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అక్రమ దందా గురించి సమాచారం ఇచ్చిన కూడ పోలీసులు పట్టించుకోవడం లేదని రాత్రిపూట పెట్రోల్ వెహికల్ తిరిగినా గాని పట్టించుకునే దిక్కు లేదని, ఈ దందా వెనుక కొంతమంది అధికార పార్టీ నేతల హస్తం ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు, సిబ్బంది సహకారం పుష్కలంగా ఉండటంతో జోరుగా మట్టి దందా సాగుతోందని, మట్టి తరలిస్తున్న టిప్పర్లపై పోలీసులు, ఆర్అండ్బీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

## సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

### - కమిషనర్ పులి శ్రీనివాసులు




**గుంటూరు( ప్రశ్న న్యూస్)** గుంటూరు నగరంలోని గ్రీన్ గ్రేస్ అపార్ట్మెంట్ నిర్మాణ పనులకు వర్క్ స్టాప్ ఆర్డర్ నోటీసు జారీ చేసినపట్టికీ, అంతర్గతంగా పనులు జరుగుతుండం, కేటాయించిన విధుల్లో పర్యవేక్షణ లోపంపై స్థానిక వార్డ్ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శి, టిపిబిఓలను విధులను సస్పెండ్, టిపిఎస్, ఏసిపి, డిసిపి, సిటి ప్లానర్లలకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని నగర నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్థానిక పట్టాభిపురం మెయిన్ రోడ్ లో నిర్మాణంలో ఉన్న గ్రీన్ గ్రేస్ అపార్ట్మెంట్ నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టకపోవడంపై జిఎంసి వర్క్ స్టాప్ ఆర్డర్ నోటీసు జారీ చేసి, స్థానిక పట్టణ ప్రణాళిక అధికారులను పనులు జరగకుండా పర్యవేక్షణ చేయాలని ఆదేశించామని తెలిపారు. అనంతరం పనులు అంతర్గతంగా జరుగుతున్నాయని అందిన ఫిర్యాదుల మేరకు జిఎంసి అదనపు కమిషనర్ నేతృత్వంలో కమిటి ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కమిటి ప్రాధమిక నివేదిక, మంగళవారం తమ క్షేత్ర స్థాయి పరిశీలన అనంతరం వర్క్ స్టాప్ ఆర్డర్ నోటీసు అందిన అనంతరం కూడా పనులు జరిగాయని నిర్ధారించడం జరిగిందని, కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యంపై స్థానిక వార్డ్ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శి సిహెచ్.జగన్మోహనరావు, టిపిబిఓ కె.నిఖిల్ వంశీలను విధుల నుండి సస్పెండ్ చేస్తూ, పర్యవేక్షణ అధికారులైన టిపిఎస్ సత్యనారాయణ, ఏసిపి రెహ్మాన్, డిసిపి సూరజ్ కుమార్, సిపి రాంబాబులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నామని తెలిపారు. వర్క్ స్టాప్ ఆర్డర్ నోటీసులు అందిన తర్వాత కూడా పనులు చేపట్టిన భవన యజమానిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

## చీకటి కార్తీక్ కు మంత్రి పొంగులేటి అభినందన

### పార్టీ గెలుపులో యువజన నాయకుల పాత్ర కీలకం

### ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని సూచన



**కొత్తగూడెం (ప్రశ్న న్యూస్)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులై ప్రమాణస్వీకారం చేసిన అనంతరం తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని చీకటి కార్తీక్ హైదరాబాద్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చీకటి కార్తీక్ ను మంత్రి పొంగులేటి అభినందించారు. పార్టీ గెలుపులో యువజన నాయకుల పాత్ర కీలకమన్నారు. రాబోవు స్థానిక ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ సత్తా చాటేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి వెళ్ళేలా యువజన నాయకులు కృషి చేయాలన్నారు. అదేవిధంగా యువజన విభాగం తరుపున విస్తృతంగా సేవా కార్యక్రమాలను చేపట్టాలని చీకటి కార్తీక్ కు మంత్రి పొంగులేటి సూచించారు.

# ఎన్టీఆర్ లేకుండానే

## షూటింగ్ స్టార్ట్ చేయబోతున్న ప్రశాంత్ నీల్!

టాలీవుడ్ అగ్ర కథానాయకుడు యంగ్ టైగర్ ఎన్టీఆర్, కన్నడ స్టార్ దర్శకుడు కేజీఎఫ్, సలార్ చిత్రాల ఫేమ్ ప్రశాంత్ నీల్ కాంబోలో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. అనే వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమాను పుష్ప 2తో సూపర్ హిట్ అందుకున్న మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుండగా.. రుక్మిణి వసంత్ కథానాయికగా నటించబోతున్నట్లు సమాచారం. ఇప్పటికే పూజ కార్యక్రమాలు పూర్తిచేసుకున్న ఈ చిత్రం షూటింగ్ ఎప్పుడు స్టార్ట్ చేస్తుందా ఎప్పుడు అప్‌డేట్‌లు వస్తాయా అని అటు అభిమానులతో పాటు ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలోనే మూవీ షూటింగ్‌కి సంబంధించి అప్‌డేట్ ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. %ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ రేపటినుంచి స్టార్ట్ కాబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. హైదరాబాద్ లోని రామోజీ ఫిలిం సిటీలో జరిగే ఈ షెడ్యూల్‌లో వందలాది మంది జూనియర్ ఆర్టిస్టులు, పోలీస్ అధికారుల పాత్రలతో ఓ భారీ యాక్షన్ సన్నివేశంతో చిత్రీకరణను ప్రారంభిస్తారని తెలుస్తోంది. ఇక ఈ షెడ్యూల్‌లో తారక్ పాల్గొనడం లేదని సమాచారం. మరోవైపు ఈ సినిమా టైటిల్ డ్రాగన్ అనే అనుకుంటున్నట్లు తెలుస్తుంది.






## ఛత్రపతి శివాజీగా రిషబ్‌శెట్టి.. ఫస్ట్ లుక్ రిలీజ్



కాంతార సినిమాతో పాన్ ఇండియా వైడ్‌గా గుర్తింపు తెచ్చుకున్నాడు కన్నడ నటుడు రిషబ్ శెట్టి. ప్రస్తుతం ఈ సినిమా ప్రీక్వెల్ తెరకెక్కించే పనిలో ఉన్నాడు. దీనితో పాటు తెలుగులో 'జై హనుమాన్' సినిమా చేస్తున్నారు. ఇదిలావుండగా.. ఆయన బాలీవుడ్ నుంచి వస్తున్న ఒక సినిమాలో ఛత్రపతి శివాజీ పాత్రలో నటించనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ మూవీ నుంచి ఫస్ట్ లుక్ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ సినిమాకు 'ది ప్రైడ్ ఆఫ్ భారత్: ఛత్రపతి శివాజీ మహారాజ్' అనే టైటిల్‌ను పెట్టారు మేకర్స్. ఇక నేడు ఛత్రపతి శివాజీ మహారాజ్ పుట్టినరోజు సందర్భంగా మూవీ ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. ఈ సినిమాకు సందీప్ సింగ్ దర్శకత్వం వహించబోతున్నాడు. ఈ సినిమాను 2027 జనవరి 21న హిందీతో పాటు తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం భాషల్లో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది.

### రాజమౌళికి ఐ లవ్ యూ

# చెప్పిన రష్మి..

### - వైరలవుతున్న పాత వీడియో



దిగ్గజ దర్శకుడు రాజమౌళి, యాంకర్ రష్మికి సంబంధించిన ఒక పాత వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. మా టీవీ(ఇప్పుడు స్టార్ మా) వేదికగా అప్పట్లో 'యువ' అనే సీరియల్ వచ్చింది. ఈ సీరియల్‌లో వాసు, విశ్వ, కృష్ణుడు, యాంకర్ రష్మి గౌతమ్, కరుణ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. అన్నపూర్ణ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అక్కినేని నాగార్జున ఈ సీరియల్‌ను నిర్మించగా.. సబీహ ఈ సీరియల్‌కి దర్శకత్వం వహించారు. 2008లో ఈ సీరియల్ ప్రసారమైంది. ఈ సీరియల్ ప్రమోషన్స్ కోసం రాజమౌళితో పాటు అనుష్కాను నటించమని నాగార్జున కోరగా.. ఇద్దరు యాక్సెప్ట్ చేయడంతో పాటు యువ సీరియల్‌లో కామియో పాత్రలో నటించారు.ఇందులో భాగంగానే రాజమౌళి రష్మి కలిసి నటించారు. వీరిద్దరిపై ఒక సరదా లవ్ ట్రాక్ ఉంటుంది. ఐ లవ్ యూ అంటూ రాజమౌళికి రష్మికి ప్రపోజ్ చేస్తుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. మరోవైపు అనుష్కా కూడా ఇందులో నాగలక్ష్మి అనే పాత్రలో మెరిసింది.

### ఆ సంఘటనతో


# మారాను



జీవితం అన్న తర్వాత ఒడిదుడుకులు సహజం. కుదుపులు లేకుండా ప్రయాణం సాగదు. నా జీవితంలో పెద్ద కుదుపు ఏడాది క్రితం జరిగిన యాక్సిడెంట్. దాని వల్ల చాలా విషయాలు నేర్చుకున్నా.' అంటున్నది అందాలభామ నభా నటేష్. నన్ను దోచుకుందువటే, ఇస్మార్ట్ శంకర్ సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న ఈ అందాలభామకు సోలో బ్రతుకే సో బెటర్, అల్లుడు అదుర్స్, మ్యాస్ట్రో, డార్లింగ్ సినిమాల రూపంలో పరాజయాలు పలకరించాయి. ఈ బాధ నుంచి తేరుకునే లోపే పుండుకు పుల్ల మొగుడు అన్న చందాన.. నభా నటేష్‌కు యాక్సిడెంట్ అయ్యింది. సర్జరీలు కూడా జరిగాయి. దాంతో ఓ ఏడాదిపాటు సినిమాలకు దూరం కావాల్సి వచ్చింది. ప్రస్తుతం నభా తేరుకున్నది. ప్రస్తుతం నిఖిల్‌తో 'స్వయంభూ' సినిమా చేస్తూ బిజీగా ఉన్నది. ఇటీవల జిమ్‌లో తాను వర్కవుట్ చేస్తున్న ఓ ఫొటోను సోషల్‌మీడియాలో పోస్ట్ చేసి, కామెంట్‌ని కూడా జత చేసింది నభా. 'యాక్సిడెంట్ తర్వాత, తిరిగి మామూలు స్థితికి రావడానికి చాలా శ్రమించా. ఆ క్షణంలోమానసికంగా ఎంతో బాధ అనుభవించా. ఫిట్‌నెస్ కోసం శ్రమించా. ఇప్పుడు నా శరీరంపై నాకు అవగాహన పెరిగింది. మొబిలిటీ ఎక్సర్సైజ్‌లు, స్విమ్మింగ్, డ్యాన్సింగ్ చేయడానికి ఇష్టపడుతున్నా. నటిగా ఉన్నప్పుడు తప్పదు కాబట్టి వ్యాయామం చేశా. ఇప్పుడు తప్పనిసరిగా వ్యాయామంచేస్తున్నా. ఈ యాక్సిడెంట్ వల్ల వర్కవుట్స్ విషయంలో నా ఆలోచనాధోరణి మారింది.' అని చెప్పుకొచ్చింది నభానటేష్.

### సుకుమార్ సినిమా

# జోనర్ అదేనా?



ప్రస్తుతం రామ్‌చరణ్ విలేజ్ స్పోర్ట్స్ డ్రామాలో నటిస్తున్నారు. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. రామ్‌చరణ్ నటిస్తున్న 16వ చిత్రమిది. దీని తర్వాత ఆయన సుకుమార్ డైరెక్షన్‌లో సినిమా చేయబోతున్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ సెట్స్‌మీదకు వెళ్లడానికి ఇంకా చాలా సమయ ఉంది. అయితే ఈ సినిమా జోనర్ గురించి సోషల్‌మీడియాలో ఆసక్తికరమైన చర్చ జరుగుతున్నది.'రంగస్థలం' నుంచి 'పుష్ప' సిరీస్‌లోని రెండు చిత్రాల వరకు సుకుమార్ మాస్ కథలతోనే బాక్సాఫీస్‌ను షేక్ చేశారు. దీంతో రామ్‌చరణ్ సినిమాకు ఆయన మళ్లీ మాస్ కథనే ఎంచుకుంటారా? లేదా కొత్త దారిలో వెళతారా అన్నది అభిమానుల్లో ఉత్కంఠను పెంచుతున్నది. విశ్వసనీయ సమాచారం ప్రకారం న్యూఏజ్ యాక్షన్ డ్రామాగా సుకుమార్ ఈ సినిమాను తెరకెక్కించబోతున్నారని తెలిసింది.ఇందులో రామ్‌చరణ్ మోడరన్ లుక్స్‌తో కనిపిస్తారని, గ్లోబల్ ఆడియెన్స్‌కు చేరువయ్యేలా యాక్షన్, అడ్వెంచర్, రొమాన్స్ అంశాల కలబోతగా సుకుమార్ ఈ సినిమాను తీర్చిదిద్దబోతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయంలో నిజమెంతో తెలియాలంటే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మించనుంది.

# మళ్లీ పూసలు అమ్ముకోవాల్సిందేనా..

## డైరెక్టర్ ప్రొడ్యూసర్‌కి గొడవ.. అయోమయంలో మోనాలిసా



ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో మోనాలిసా అనే అమ్మాయి వైరల్ అయిన విషయం తెలిసిందే. మధ్యప్రదేశ్ ఇండోర్ లోని ఓ చిన్న పల్లెటూరు నుంచి పూసలు అమ్ముకోవడానికి మహాకుంభమేళాకు వచ్చింది మోనాలిసా. అయితే తన వ్యాపారం బాగా జరుగుతుందనుకుంటే ఒక నెటిజన్ ఆమె ఫొటో తీసి సోషల్ మీడియాలో పెట్టాడు. దీంతో రాత్రికి రాత్రే వైరల్‌గా మారింది మోనాలిసా. తన తేనె కళ్లు, అందం, చిరునవ్వుతో నెటిజన్ల దృష్టిని ఆకర్షించింది. దీంతో కుంభమేళాకి వెళ్లిన వారు ఆమెతో ఫొటో దిగడానికి ఆసక్తిచూపించడం.. ఫొటోల పేరుతో ఆమెను ఎక్కడపడితే అక్కడ తాకడం వివాదానికి దారి తీసింది. దీంతో తన పూసల బిజినెస్ వదిలేసి తన గ్రామంకి వెళ్లిపోయింది. అయితే మోనాలిసాకి జరిగిన అన్యాయం తెలుసుకున్న నెటిజన్లు ఆమెకి సపోర్ట్‌గా నిలిచారు. ఫేమస్ అనే పేరుతో అమె బ్రతుకుదెరువు మీద కొట్టారంటూ నెటిజన్లు కామెంట్లు పెట్టారు. ఇదిలావుంటే మోనాలిసా పరిస్థితి తెలుసుకున్న బాలీవుడ్ డైరెక్టర్ సనోజ్ మిశ్రా ఆమె చిత్రాలు చూసి హీరోయిన్‌గా అవకాశం ఇస్తానని తెలిపాడు. ఇప్పటికే మణిపూర్ నేపథ్యంలో రాబోతున్న ఒక మూవీకి సంతకం కూడా చేసింది మోనాలిసా. ఈ సినిమా కోసమే ప్రస్తుతం యాక్టింగ్ పై ట్రెయినింగ్ కూడా తీసుకుంటుంది మోనాలిసా. మరోవైపు మోనాలిసాకి సంబంధించిన అన్ని పనులను దగ్గరుండి చూసుకుంటున్నాడు దర్శకుడు సనోజ్ మిశ్రా. అయితే సనోజ్ మిశ్రా .. మోనాలిసాతో క్లోజ్‌గా ఉండటంపై బాలీవుడ్ నిర్మాత జితేంద్ర నారాయణ్ సింగ్ అభ్యంతరం వ్యక్తంచేశారు. సనోజ్ మిశ్రాపై సంచలన వ్యాఖ్యలు చేశారు. సనోజ్ మోనాలిసాను పబ్లిసిటీ కోసం వాడుకుంటున్నారని, ఆమెను ట్రాప్ చేస్తున్నారని, తప్పుదారి పట్టిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు.ఇదిలావుంటే తాజాగా ఈ వ్యాఖ్యలపై సనోజ్ మిశ్రా స్పందించారు. మోనాలిసా నా కూతురు లాంటిదని తెలిపాడు. ఆమె నా కూతురు వయసు ఉంటుంది. నేను ఆమెను వేధించట్లేదు. ఆమె ఇష్టపూర్వకంగానే సినిమాలో నటిస్తుంది. మోనాలిసా ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఆమెను నేనే యాక్టింగ్ నేర్పిస్తున్నాను. ఇది తప్పుదోవ పట్టించడం కాదు. తనకి యాక్టింగ్ వచ్చింది అన్నప్పుడు సినిమా స్టార్ట్ చేస్తానని తెలిపాడు. మరోవైపు జితేంద్ర నారాయణ్‌పై కూడా విమర్శలు కూడా గుప్పించాడు. తన అబద్ధాలతో మొత్తం దేశాన్నే ట్రాప్ లోకి లాగుతున్నాడని మండిపడ్డారు. ఇక వీరిద్దరి గొడవతో ప్రాజెక్ట్ ఆగిపోతుందేమోనని భయపడుతుంది మోనాలిసా.

# గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కలిసిన ముప్పిడి నవీన్ కుమార్ మాదిగ



**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను దళిత చైతన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పిడి నవీన్ కుమార్ మాదిగ మర్యాద బుధవారం పూర్వకంగా కలిశారు.సికింద్రాబాద్ లోని ఇఫ్లు యూనివర్సిటీలో జరిగిన ఓ కార్యక్రమానికి విచ్చేసిన ఆయనను పుష్పగుచ్చెం మిచ్చి ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రజా సమస్యలపై తమ సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని ఈ సందర్భంగా గవర్నర్ దృష్టికి ముప్పిడి నవీన్ కుమార్ తీసుకెళ్లారు.

## మేడ్చల్ ఆర్ యు బి ని వెంటనే పూర్తి చేయాలి



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** మేడ్చల్ రైల్వే స్టేషన్ ను సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు, మేడ్చల్- మల్కాజ్గిరి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్ స్థానిక నాయకులతో కలిసి సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ కు వినతిపత్రం అందజేశారు. మేడ్చల్ పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే అండర్ బ్రిడ్జ్ (ఆర్ యు బి) నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్ యు బి పనులు మందకోడిగా సాగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని అంబులెన్స్ లు, స్కూలు బస్సులు, కాలేజీ బస్సులు ఈ దారిలో వెళ్లలేక చాలా ఇబ్బంది అవుతుందని తెలిపారు. పక్క గ్రామాలకు వెళ్లాలంటే 10 కిలోమీటర్లు దాటి వెళ్ళవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జీఎం వెంటనే స్పందించి తొందరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు భాస్కర్ యాదవ్ తెలిపారు, ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కోడే మహేష్, ఒగ్గు శంకర్, పద్మా రెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చత్రపతి శివాజీ జయంతి వేడుకలు



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** ఛత్రపతి శివాజీ మహారాజ్ 395వ జయంతి వేడుకలు మేడ్చల్ మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జల్లి శైలజ హరినాథ్ మడ్లడుతూ యువత శివాజీ మహారాజ్ నీ స్ఫూర్తిగా తీసుకుని దేశం కోసం ధర్మం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు పాతూరి ప్రభాకర్ రెడ్డి, జకట ప్రేమ్ దాస్, మేడ్చల్ మున్సిపాలిటీ బీజెవైఎం అధ్యక్షులు కానుకంటి వంశీ విజయ్ వంజరి, చేర్వుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, అవినాష్ చారీ, బొజ్జ వంశీ రెడ్డి, హేమలత రెడ్డి, బచ్చు కృష్ణ ప్రియ మల్లారెడ్డి, పుష్ప మల్లారెడ్డి, గౌలికర్ మహేష్, రాగం అర్జున్, కొండం ఆంజనేయులు ముదిరాజ్, థాత్రిక లక్ష్మణ్ వంజరి, మైసరి రాజు వంజరి, సాకారబోయిన వెంకటేష్, మమిళ్ళ నర్సింగ్ రావు, గొపు నాగరాజ్, దోసడి రామచంద్ర రెడ్డి, ఎన్.ఎస్.గౌడ్, జకట బాబు రాజు, కిష్టపూర్ అర్జున్, మధుసూదన్ రెడ్డి, ఈశ్వర్ కురుమ, రతన్ రాథోడ్, హరి బాబూ రెడ్డి, దగ్గు రాజు, సత్యనారాయణ రెడ్డి, సదమణి నరేందర్, మల్లేష్ యాదవ్, విజయ్, డీ.సాయి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పారశాలలో ఖాళీ టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులు మంజూరు చేయాలి.ఎ ఐ వై ఫ్ జిల్లా కార్యదర్శి

**ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డిఎస్సి నిర్వహించాలి**

**నంద్యాల జిల్లా కార్యదర్శి నాగరాముడు డిమాండ్**




**నంద్యాల (ప్రశ్న న్యూస్ )** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో ఖాళీ పోస్టులు భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య ఎ ఐ వై ఫ్ కార్యదర్శి రాష్ట్ర పిలుపు భాగంగా డి ఆర్ జ గారికి జరిగింది. ఈ సందర్భంగా ఎ ఐ వై ఫ్ జిల్లా కార్యదర్శి జి.నాగ రాముడు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మొదటి సంతకం చేశారు. కానీ నోటిఫికేషన్ వెలుబడలేదు. నోటిఫికేషన్ లేక లక్షలాదిమంది నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లో లక్షల్లో ఫీజులు చెల్లించి నోటిఫీకేషన్ వెలువడక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, అదేవిధంగా అనంతపురం, కర్నూలు, కడప, ప్రకాశం, నెల్లూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల పోస్టులలో అన్యాయం జరిగిందని తగిన పోస్టులు మంజూరు చేయలేదని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారనీ వారు అన్నారు. కావున తమరి ద్వారా ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకువెళ్లి అభ్యర్థులకు న్యాయం జరిగేలా అన్ని జిల్లాలకు స్థానిక అవసరాల రీత్యా పోస్టుల మంజూరు జరిగేలా , త్వరితగతిన డీఎస్సీ నోటిఫికేషన్ అన్ని వివరాలతో వెలువడేలా కృషి చేయాలని లేనిపక్షంలో అఖిల భారత యువజన సమాఖ్య ఎ ఐ వై ఫ్ ఉద్యమాలు చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమం లో డోన్ మండలఎ ఐ వై ఫ్ అధ్యక్షులు కార్యదర్శి పృథ్వి కుమార్ ,జి హరికృష్ణ,ఎ ఐ వై ఫ్ డోన్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు దివాకర్, రజాక్, నాయకులు శివ,రాజు,బాలు, తదితరులు పాల్గొన్నారు

# భాగ్యనగరం అభివృద్ధి లో పాలమూరు బిడ్డల పాత్ర గొప్పది-జూపల్లి కృష్ణారావు

**పాలమూరు బిడ్డలకు అండగా ఉంటా**

**జీహెచ్ ఎంసీ ఎన్నికలలో కార్పొరేటర్ టికెట్ పాలమూరు వాసులకు ఇప్పించే బాధ్యత నాది**

**తల్లి తండ్రులు పిల్లలకు మంచి విద్యను అందించేందుకు పాటు పడాలి**






**కూకట్ పల్లి(ప్రశ్నన్యూస్)** హైదరాబాద్ నగరానికి వలస వచ్చిన పాలమూరు బిడ్డలకు అండగా ఉంటానని తెలంగాణ రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి ఎల్లమ్మబండ జన్మభూమికాలీలో నూతనంగా ఏర్పాటు చేసిన పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం కార్యాలయాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం సభ్యులు మంత్రి జూపల్లి కృష్ణారావును బోనాలు, బతుకమ్మ, కోలాటంలతో స్వాగతం పలికారు. భారి క్రేన్‌తో మంత్రి గజ మాలతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించిన అనంతరం పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని ముంబాయి, పుణే నగరాలలేనే కాకుండా దేశ విదేశాలలో అనేక ఆకాశ హర్మ్యాలు నిర్మించిన కూలీలు పాలమూరు కార్మికులేనని అన్నారు. ఎక్కడ ఉపాధి అవకాశాలు లభిస్తే అక్కడికి వెళ్లి కూలి పని చేసుకునే జీవించే నిస్వార్థ జీవులు పాలమూరు వాసులని అన్నారు. నగరంలో పొట్టకూటి కోసం వచ్చి లక్షలాది సంఖ్యలో నివాసం ఉంటున్న పాలమూరు వాసుల కష్ట సుఖాలను, సంక్షేమం కోసం పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఇటు వంటి మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంఘం సభ్యులకు, పాలమూరు వాసులకు అండగా ఉంటానని అన్నారు. పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘంకు తన ద్వారా 5 లక్షల రూపాయలు నిధిని సమకూరుస్తానని అన్నారు. అదే విధంగా ఎంతో మంది భవన నిర్మాణ కార్మికులుగా పాలమూరు వాసులతో పాటు వేరే ప్రాంతాలకు చెందిన వారు కష్టం చేసుకుంటు నగరంలో జీవనం కొనసాగిస్తున్నారు. వారికి భవన నిర్మాణ కార్మికుల కార్డులను అందజేసి ప్రభుత్వం ద్వారా అందాల్సిన అన్ని సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలని సంఘం సభ్యులకు సూచించారు. అదే విధంగా పిల్లల తల్లి తండ్రులు తమ పిల్లలకు మంచి విద్యను అందించేందుకు కృషి చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి నిష్ణాతులైన, అపార అనుభవం కలిగిన ప్రభుత్వ ఉపాధ్యాయులతో విద్యా బోధన అందించేలా కృషి చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో వేలాది సంఖ్యలో పాలమూరు వాసులు నివాసం ఉంటున్నారని, రానున్న జీహెచ్ ఎంసీ ఎన్నికలలో పాలమూరు వాసులకు టికెట్ కెటాయించాలని స్థానికులు కోరడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడితో మాట్లడి తప్పకుండా పాలమూరు వాసులకు టికెట్ కెటాయించేలా చూస్తానని హామి ఇచ్చారు. పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం సభ్యులు ప్రస్తుతం అందిస్తున్న తమ సేవలు విద్యా, ఉపాధి అవకాశాలు కల్పించడానికి మరింత విస్తరించి ప్రతి ఒక్క నిరుద్యోగికి బాసటగా ఉండాలని, ప్రతి విద్యార్థికి తోడుగా ఉండాలని కోరారు. అనంతరం పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం వ్యవస్థాపక సభ్యులు ఎం.ఏ. కరీమ్ మాట్లాడుతూ ఇప్పటికే పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువకుడి కోసం పాలమూరు టీ స్టాల్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, అదే విధంగా సంఘం కార్యాలయంలో త్వరలో గ్రంథాలయం, స్టడి రూంలను ఏర్పాటు చేసేందుకు సిద్ధం అవుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక సభ్యులు శ్రీధర్ పంతులు, గోపాస్ రవీందర్, సంకి సత్యం, గోపాస్ చంద్రశేఖర్, బంగారి బండి, దాసరి కుర్మయ్య, కందూరి రాములు, లోకేష్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి, గోపాల్, సాయి, వెంకటేష్, యాదగిరి, శ్రీకాంత్, శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

## మత సామరస్యాన్ని పెంపొందించిన బహుజన చక్రవర్తి ఛత్రపతి శివాజీ


**ఛత్రపతి స్ఫూర్తితో అంతరాలు లేని సమాజంకై కృషి చేయాలి**

**ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి**




**ఉప్పల్ (ప్రశ్న న్యూస్)** మత సామరస్యాన్ని నెలకొల్పిన చత్రపతి శివాజీ మహారాజ్ ని స్మరించుకొని ఆయన ఆశయాలు, లక్ష్యాల కోసమే పోరాడుదామని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర,మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ పిలుపునిచ్చారు. ఛత్రపతి శివాజీ 395వ జయంతిని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర,మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ లు సంయుక్తంగా మాట్లాడుతూ మహారాష్ట్రలో 16వ శతాబ్దంలో ఉన్న వైదిక, బ్రాహ్మణీయ ఆధిపత్య కులాలు మాత్రమే రాజ్యాన్ని పరిపాలించాలి, శూద్రులు రాజ్యానికి పరిపాలించడానికి వీలు లేదు అనే సంస్కృతిని ధిక్కరిస్తూ పిష్వాలా వ్యతిరేకంగా మహారాష్ట్రలో మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పిన శూద్ర కులాల, కార్మిక వర్గం ప్రజల ప్రతినిధి చత్రపతి శివాజీ అని వారు అన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించక ముందు సిద్ధించిన తర్వాత కొంతమంది బ్రాహ్మణీయ భావజాలం కలిగిన రాజకీయ నాయకులు, పార్టీలు శివాజీని హిందూ ధర్మాన్ని, మతాన్ని ముస్లిం రాజుల నుంచి కాపాడిన వ్యక్తిగా ముస్లిం వ్యతిరేకిగా చరిత్రను వక్రీకరించారని ఆయన తెలిపారు. చత్రపతి సైన్యంలో అన్ని మతాలకు అన్ని కులాలకు సమానమైన ప్రాధాన్యం ఇచ్చేవారని దానిని అందరూ గుర్తించాలని అన్నారు. అదేవిధంగా శివాజీ తన రాజ్యంలో రైతుల సంక్షేమం కోసం కార్మికుల సంక్షేమం కోసం అనేక సంస్కరణలు, సంక్షేమ విధానాలను తీసుకువచ్చి దున్నేవాడిదే భూమి అని భూమిని పంచిన చరిత్ర ఆయనకు ఉందని తెలిపారు. భారతదేశానికి స్వతంత్రం వచ్చిన తర్వాత శివాజీని కొన్ని రాజకీయ పార్టీలు ప్రధానంగా బిజెపి ఆర్ఎస్ఎస్ దాని అనుబంధ మత సంస్థలు ప్రజల ఓట్లు కొల్లగొట్టడానికి తప్పుడు సూత్రీకరణలు చేస్తున్నారని దానిని ప్రజలు గమనించాలన్నారు. జ్యోతిరావు పూలే,డాక్టర్ అంబేద్కర్, గోవింద్ పన్సారే లాంటి మహనీయులు శివాజీ వాస్తవ చరిత్రను తీసుకువచ్చే ప్రయత్నం చేశారని చత్రపతి శివాజీ లక్ష్యాలు, శూద్ర కులాలకు రాజ్యాధికారం, రైతుల, కార్మికుల సంక్షేమం కోసమే ప్రజలు ఉద్యమించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నేత సతీష్ కుమార్,ఏఐవైఎఫ్ జిల్లా నేతలు గిరి బాబు,సాయి, రాజు, విజయ్, అక్షయ్, సుదర్శన్, సీపీఐ ఉప్పల్ మండల కార్యవర్గ సభ్యులు నారా నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## కూకట్ పల్లి లో యం యల్ ఏ మాధవరం కృష్ణారావు జన్మ దిన వేడుకలు



**కూకట్పల్లి (ప్రశ్న న్యూస్)** బుధవారం కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జన్మదినము సందర్భంగా కెపిహెచ్బి డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు నివాసం వద్ద కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు పర్యాయాలుగా కూకట్పల్లి నియోజకవర్గం లో ప్రజలు మనసు గెలిచి అఖండ మెజారిటీతో విజయం సాధిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారని ..నిత్యం ప్రజల గురించి ఆలోచించే గొప్ప నాయకుడని ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు సాయిబాబా చౌదరి ,శ్యామల రాజు, సురేష్ రెడ్డి, రాజేష్ రాయ్, నాగేశ్వరరావు, హనుమంత్ రావు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితం భావితరానికి స్ఫూర్తిదాయకం: మాజీ మంత్రి కృష్ణ యాదవ్



**అంబర్ పేట (ప్రశ్న న్యూస్)** అంబర్ పేట డివిజన్ పటేల్ నగర్ చౌరస్తాలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బిజెపి యువ మోర్చా ప్రధాన కార్యదర్శి అంబర్ పేట డివిజన్ కాంటెస్ట్ కార్పొంటర్ ఏ.యశ్వంత్ ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ జయంతి ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి కృష్ణ యాదవ్ వచ్చేసి 395 వ చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు సనాతన ధర్మ పరిరక్షణకు, హిందూ సామ్రాజ్య విస్తరణకు, చత్రపతి శివాజీ ఎనలేని పోరాటం చేశారన్నారు. చత్రపతి శివాజీ ధైర్య సాహసాలు, తెగువ తో వీరోచిత పోరాటం చేసి మొగల్ సామ్రాజ్యాన్ని గజగజ వణికించారని వారు కొనియాడారు. హిందూ ధర్మాన్ని పరిరక్షించేందుకు శివాజీ చేసిన పోరాటం చిరస్మరణీయమని వారు కొనియాడారు. ప్రతి ఒక్కరు శివాజీ ఆశయ సాధనకు పాటుపడాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాల్లో బిజెపి రాష్ట్ర నాయకులు ఏ. బిక్షపతి , మైలారం రాజు,వర్కాల శ్రీకాంత్, దయాకర్ యాదవ్, నవీన్ రెడ్డి,పెంటం రాజు, రామచంద్ర గుప్తా, బిజెపి నగర నాయకులు భాస్కర్ గౌడ్, యాదగిరి, అంబర్ పేట అసెంబ్లీ బిజెపి ఓబీసీ మోర్చా కన్వీనర్ వెంకటేష్ గౌడ్, మల్లికార్జున్, నగర యువ మోర్చా నాయకులు మనోజ్ యాదవ్, అంబర్ పేట డివిజన్ యువ మోర్చా నాయకులు ఎస్ ఎస్ రెడ్డి, మహిళా మోర్చా నాయకురాలు సరోజిని, రాజు నేత, అయోధ్య రాములు, బాలేష్, శ్రీనివాస్ యాదవ్, కార్యకర్తలు బస్తి పెద్దలు యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి ముక్కంటి సేవలో పేమ్మసాని కేంద్రమంత్రి



**శ్రీకాళహస్తి (ప్రశ్న న్యూస్ )**ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానానికి కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కుటుంబ సభ్యులతో విచ్చేశారు విరిని శ్రీకాళహస్తి నియోజకవర్గం శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ కార్యనిర్వణాధికారి టి. బాపిరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి వారిలా ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు నిర్వహించారు. కేంద్రమంత్రి కుటుంబ సమేతంగా జ్ఞాన ప్రసూనాంబ సమేత వాయు లింగేశ్వరుని దర్శించుకున్నారు. దర్శన అనంతరం ,శ్రీమేధా గురుదక్షిణామూర్తి సన్నిధానం వద్ద కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కుటుంబ సభ్యులకు వేద పండితులు మంత్రోచ్చారణలతో ఆశీర్వాదం ఇవ్వగా శ్రీకాళహస్తి నియోజకవర్గం శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి దంపతులు శేష వస్త్రంతో సత్కరించి శ్రీ జ్ఞాన ప్రసూనాంబా సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు

**కేంద్ర మంత్రి మాట్లాడుతూ**

తాను బడ్జెట్ సమావేశాల గురించి తిరుపతిలో ప్రస్తావించడానికి తాను వచ్చానని ,అయితే తనను స్థానిక శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి ,మరియు బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ శ్రీ కాళహస్తి దేవస్థానాన్ని దర్శించుకోవడం ఆహ్వానం పలకగా, శ్రీ కాళహస్తి దేవస్థానాన్ని దర్శించుకున్నానని, అయితే బోజ్జల సుధీర్ రెడ్డి తాను అధికారంలో వచ్చిన తర్వాత శ్రీకాళహస్తిసుందరీ కారణంగా తీర్చిదిద్దడంలో ఆయన చేస్తున్న కృషి కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుందని , శ్రీకాళహస్తిలో ప్రవేశించగానే రహదారులు మరియు రహదారుల మధ్య డివైడర్ సుందరీ కారణంగా తీర్చిదిద్దడంతో నేడు శ్రీకాళహస్తి అత్యంత అద్భుతంగా గోచరిస్తుందని, శ్రీకాళహస్తి సుంద్రీకరణంగా తీర్చిదిద్దుతున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డికి ఆయన అభినందనలు తెలియజేశారు.

# రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కొల్లగొడుతున్న ఉచిత పథకాలు

- ఉపశమనం కల్గించే ఉచితాలు వద్దు - సంక్షేమం అభివృద్ధి వైపు అడుగులు పడాలి
- పేదల కడుపుకొట్టు ఉచితాలు పొందుతున్న ధనవంతులు
- జీతాలు. పెన్షనర్లు, వడ్డీలకు కూడా సరిపోని రాష్ట ఆధాయం
- బావితరాల ప్రయోజనాలను తాకట్టు పెట్టి కొత్త అప్పులతో ఉచితాల సంతర్పణ
- సంక్షేమం పథకాల ముసుగులో రాయితీలు, ఉచితాలతో ప్రలోభపెట్టి పబ్బం గడుపుకుంటున్న రాజకీయ పార్టీలు
- వినోధం విలాసాలను ఉచితంగా ఇవ్వడం సంక్షేమమెలా అవుతుంది
- ప్రజాకర్షణ కోసం ఉచితాల పేరుతో ఖజానా దివాలాతీయిస్తున్న రాజకీయ పార్టీలు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఓట్ల రాజకీయాలలో ఉచిత పథకాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఈ ఉచిత పథకాల వల్ల ఎవరు లబ్దిపొందుతున్నారనే విషయాన్ని పక్కన పెడితే మిగులు బడ్జెట్లో ఉన్న రాష్ట్రల ఆర్థిక పరిస్థితి చిన్నభిన్నమై అప్పు ఊబిలో చిక్కుకుని కొన ఊపిరితో కొట్టుమిట్టాడుచున్నను అధికారమే లక్ష్యంగా జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీలు రాష్ట్రల ఆర్థిక పరిస్థితులను బేరీజు వేసుకోకుండా ఉచిత పథకాలను ప్రకటించి అమలుచేసే సమయంలో చతికిల పడుచుండడం గమనార్హం

### ఎన్నికల వాగ్ధానాలుగా అమలుకు నోచని ఉచిత పథకాలు

ఎన్నికలకు ముందు ఉచిత పథకాల అంశం తెరపైకి రావడం సాధారణ విషయం. గతంలో ఉచిత పథకాలపై అనేక చర్చలు జరగడమే కాక అత్యున్నత న్యాయస్థానం జోక్యం చేసుకొని ఈ అంశాన్ని పరిశీలించాలని ఎన్నికల సంఘానికి సూచించడం హర్షించదగ్గ విషయం. అయితే సంక్షేమాన్ని ఏ మాత్రం పెంచని ఉచితాలు ఆర్థికాభివృద్ధికి ఆటంకం అంటు ప్రధాన మంత్రి ప్రకటన చేయడంతో మరోసారి ఈ అంశం తెరమీదకు రావడం విశేషం. ఉచితాలు అనుచిత మంటు దాఖలైన ఓ ప్రజాప్రయోజన వాజ్యాన్ని సీకరించిన సుప్రీంకోర్టు, దీనిని అత్యంత ప్రాముఖ్యత గల అంశంగా ప్రకటించడం విశేషం. దేశంలో ఆర్థిక సమతుల్యత చాలా ముఖ్యం. అందరి దగ్గర సమానంగా డబ్బు ఉండకపోవచ్చు. కాని అందరి కనీస అవసరాలు తీరేలా ఉండాలన్నది రాజ్యాంగ మౌలిక సూత్రం. ఈ ఉద్దేశం తోనే కొన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయి. అయితే రాను రాను సంక్షేమం స్థానంలో ఉచితాలు తెరపైకి వచ్చాయనే ఆరోపనలు వ్యక్తమవుచున్నాయి. అన్నం పెడితే ఒక పూట ఆకలి తీరుతుంది. కానీ అన్నం సంపాదించుకునే మార్గం చూపితే జీవితాంతం ఆకలి తీరుతుంది. జీవితాంతం ఆకలి తీర్చే మార్గం చూపడమే నిజమైన అభివృద్ధి. కానీ ప్రభుత్వాలు మాత్రం శాశ్వత పరిష్కారం వైపు కాకుండా తాయిలాలు పేరిట ఉపశమనాలు కల్పిస్తు సంక్షేమం అని గొప్పగా చెప్పుకోవడం విడ్డూరంగా మారింది. దేశంలోని అన్ని ప్రభుత్వాలు పోటాపోటీగా ఉచిత పథకాలవైపు మెగ్గుచూపి అభివృద్ధిని కుంటుపట్టించి ప్రజల జీవితాలలో ఆగాధాలను సృష్టిస్తున్నారు. అధికారాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా రాజకీయ పార్టీలు ఎన్నికల ముందు అమలుకు సాధ్యంకాని ఉచిత హామీలను గుప్పించి ఆధికారం చేజిక్కిన వెంటనే హామీల అంశాన్ని మరుగున పడేయడం అలవాటుగా మారింది. దీనికి ఏ రాజకీయ పార్టీ కూడా మినహాయింపు కాదు. ఎందుకంటే వీరు అందరు కూడా ఒక తానులో నుండి వచ్చిన ముక్కలే. పదవుల పరమావదిగా,అధికారమే అంతిమ లక్ష్యంగా ప్రజలకు ఉచిత వరాల జల్లులు కురిపిస్తు ఓట్లు దండుకుంటున్నారు. ఇకపోతే ఉచిత హామీల ప్రక్రియ అనేది ఒక వేలం పాటలా తయారవడం గమనార్హం. ఒక రాజకీయ పార్టీ ఒక ఫథకం ప్రకటిస్తే వెంటనే మరో రాజకీయ పార్టీ పోటీ ప్రకటనలు చేయడం విడ్డూరంగా మారింది. శ్రేయోరాజ్య స్థాపనే లక్ష్యంగా గల ప్రభుత్వాలు సంక్షేమం కోసం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేయడంలో తప్పులేదు. అది ప్రభుత్వ బాధ్యత కూడా. దేశంలో దారిద్ర్యంతో ఇబ్బందులు పడుతు ఆకలి కోరల్లో చిక్కుకున్న ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉంది. అయితే ఈ బాధ్యత నిర్వహించే సందర్భంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కూడా సమస్థాయిలో ముందుకు వెళ్ళాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ రెండింటిలో ఏ ఒక్కటి విస్మరించినను ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం కావడం ఖాయం. అయినా ప్రస్తుత ప్రభుత్వాలు ఈ లక్ష్యాలను పక్కన పెట్టి అధికారమే లక్ష్యంగా ఓటు బ్యాంకు రాజకీయాలతో జనాకర్షక ఉచిత పథకాలను ప్రకటిస్తు ముందుకు సాగడం సంక్షేమం,అభివృద్ధికి అటంకంగా మారింది. దీని వలన ప్రభుత్వ ఆదాయంలో సింహభాగం ఉచిత తాయిలాలకు పోగా ప్రతి నెల ఉద్యోగుల జీతాలు సైతం చెల్లించలేని పరిస్థితులు దాపురించి అభివృద్ధి జరిగే అవకాశం లేకుండ పోవడమే కాక అభివృద్ధి, సంక్షేమానికి తారతమ్యం లేకుండా పోతుంది. ఇకపోతే గతంలో ప్రజలు సమష్టి ప్రయోజనాల కోసం నాయకులను డిమాండ్ చేసే వారు. కాలక్రమేణా అది కాస్తా వ్యక్తిగత ప్రయోజనాల వైపు దారితీసింది. దీనిని గ్రహించిన నాయకులు అదే దిశగా ప్రయాణం చేసి ప్రజలను వ్యక్తిగతంగా సంతృప్తి పరచడంలో తలమునకలవుతున్నారు. అయితే ఇవన్నీ ఉపశమనాలు తప్ప శాశ్వత పరిష్కారం కాదని నాయకులకు తెలుసు. శాశ్వత పరిష్కారానికి దీర్ఘకాలిక లక్ష్యాలు ఉండాలి. అవి లేకపోతే ఎప్పటికీ పేదరికం అంతం కాదు. అయితే అసాధారణంగా పెరుగుచున్న ఆర్థిక అసమానతలు మన ఎగుడు దిగుడు సమాజంలో అట్టడుగు నుంచే బడుగు, బలహీన వర్గాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. పైగా, మనది సంక్షేమ రాజ్యమని రాజ్యాంగంలో పొందుపర్చుకున్నాము. అభివృద్ధిలో వారిని భాగస్వాముల్ని చేసేలా సమ్మిళిత ప్రగతి అవసరం. అందుకోసం చేపట్టే సంక్షేమ కార్యక్రమాల పట్ల ఎవరికీ అభ్యంతరం ఉండదు. కానీ, ఆ ముసుగులో యోగ్యతలు, అర్హతలతో నిమిత్తం లేకుండా అమలు చేసే పథకాల అమలు ఎప్పటికీ సమర్ధనీయం కాదు. సమష్టి ప్రయోజనాలు కోసం చేపట్టే ఉచిత పథకాలు అన్నీ ఉత్పాదకమైనవిగానే భావించాలి. ఎందుకంటే ఉచిత వైద్యం, ఉచిత విద్య ఇలాంటివి ఉత్పాదకతను మెరుగు పరుస్తాయి. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర వస్తువుల అందించడం, మధ్యాహ్న భోజన పథకం, అంగన్ వాడీల ద్వారా పిల్లలకు, మహిళలకు పోషకాహారాన్ని అందించడం ఏ ఆధారం లేని వృద్ధులుకు, వితంతువులకు, వికలాంగులకు ఇచ్చే ఫించన్, రైతుబంధు, రైతుభరోసా వంటి పథకాల వల్ల ఎన్నో సత్ఫలితాలు వస్తుండగా, ఇలాంటి వాటిని లక్ష్యం నెరవేరే వరకు కొనసాగించాల్సిన అవసరం ఉండగా దీనికి ఎవరు అభ్యంతరం చెప్పరు. అదే మీరు ఒక కులానికి చెందిన వారు మీ వయసు ప్రతిపాధికన నగదు బదిలీ చేస్తాం అనే పథకాలు వ్యక్తిగత ప్రయోజనాలు తప్ప సామాజిక సంక్షేమానికి ఉపయోగపడవు. అయితే దీనికి భిన్నంగా మా ప్రభుత్వం అధికారం లోనికి వస్తే కలర్ టీవిలు, మిక్సీలు, మొబైల్ ఫోన్లు,, గ్రైండర్లు, స్కూటీలు బంగారం ఉచితంగా ఇస్తామని కొన్ని ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయి. వినోదం, విలాసాలను ఉచితంగా ఇవ్వడం సంక్షేమమెలా అవుతుందో ప్రజలు ఆలోచించాలి. అలాగే మతపరమైన యాత్రలకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించడం, వివాహాలకు బహుమతి అందించడం వంటి వాటిని సంక్షేమ కార్యక్రమాలగా ప్రకటించుకోవడం మన నాయకులకే చెల్లింది. అన్ని రాజకీయ పార్టీలు ఈ తరహాలో పోటీపడి మరిన్ని ఉచిత పథకాలను ప్రకటించుకుంటు పోతే వాటి అమలుకు నిధులు ఎక్కడ నుంచి వస్తాయనే ఆలోచనే ప్రభుత్వాలకు స్ఫురించడం లేదు. దీనితో పాటు ఎవరి కోసం సంక్షేమ పథకాలు రూపకల్పన చేసి నిధులు ఖర్చు చేస్తే ఆ వర్గ ప్రయోజనాలు మెరుగవ్వాలి. కాని ఉచిత సంక్షేమ పథకాలు పొందే వారిలో అధిక శాతం దనవంతులే ఉండడం దురదృష్టకరం. ఇది కూడా ప్రభుత్వాలకు తెలియని విషయం కాదు. కాని పేద ప్రజలకు చెందాల్సిన సంక్షేమ నిధులను దనవంతులకు కట్టబెట్టి సమాజంలో మరింత ఆదాయ అసమానతల పెంపుకు ప్రభుత్వాలు సహకరిస్తుండడం దురదృష్టకరం. ఏది సంక్షేమం ఏది కాదు అనే తేడా కూడా గుర్తించలేనంత స్థితిలో నేడు ప్రభుత్వాలు నడుస్తున్నాయి. పేదలకు అందించే ఉచిత పథకాలను విమర్శించే వారు పెద్దలకు అందించే ప్రయోజనాలు గురించి మాట్లాడటం లేదు. ఒక వ్యవస్థ ద్వారా పేదలకు ఇచ్చే కొద్దిపాటి మొత్తాలను ఉచితాలు అంటున్నారు. కానీ తక్కువ పన్ను రేట్లు, మినహాయింపుల పేరుతో నిత్యం ధనవంతులు పొందుతున్న ఉచితాలను మాత్రం ప్రోత్సాహకాలు అంటున్నారు ఇదెక్కడి న్యాయం అంటు సామాజిక వేత్తలు ప్రశ్నిస్తున్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంపుదల, సామాజిక అభివృద్ధి సాధన కోసం ప్రభుత్వాలు దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పథకాలు ఎప్పటికీ కొనసాగించాలి.

అయితే ప్రజాకర్షణ కోసం సర్కారు ఖజానాని దివాలా తీయించే ఉచిత తాయిలాల ప్రకటన ఏ మాత్రం సమర్ధనీయం కాదు. అధికారమే లక్ష్యంగా ఓటు బ్యాంకు రాజకీయాలతో ఉచిత పథకాలు నగదు బదిలీ వంటివి చేస్తు సంక్షేమం అంటు ఆర్థిక క్రమశిక్షణ గతిని తప్పించడం సమర్ధనీయం కాదు. సంక్షేమ పథకాల ముసుగులో రాయితీలు, ఉచితాలు, ఇతర తాయిలాలతో ప్రలోభపెట్టి రాజకీయ పబ్బం గడుపుకునే రాజకీయ పక్షాలకు ఓటర్లు చెక్ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చాలా సందర్భాలలో ప్రభుత్వాలు ప్రకటించిన ఉచిత పథకాలు పొందే లబ్ధిదారులు సైతం ముక్కున వేలేసుకుని ఆశ్చర్యపోతున్నారు. ఈ డబ్బు అంతా ఎక్కడ నుంచి వస్తుందనే స్పృహ ప్రభుత్వాలకు లేదు. ఏదిఏమైతేనేం అధికారం కావాలి. నిధులు కొరత అయితే కొత్త పన్నులు వేస్తారు. అదీ సాధ్యం కాకపోతే రుణాలు చేస్తారు. దురదృష్టం ఏమిటంటే నేడు దేశంలో రాష్ట్ర ప్రభుత్వాలకు వచ్చే ఆదాయం మొత్తం జీతాలు, పెన్షన్లు, వడ్డీలు చెల్లించడానికి సరిపోవడం లేదు. కేంద్రం నుంచి ఆదాయం, కొత్త అప్పుల ద్వారా ఉచితాల సంతర్పణ చేసుకుంటు పోతు భావితరాల ప్రయోజనాలను తాకట్టు పెట్టే అధికారం ఈ ప్రభుత్వాలకు ఎవరిచ్చారని విమర్శలు వెల్లువత్తుతున్నాయి.


## ఫాస్టాగ్ నిబంధనపై గందరగోళం

- స్పష్టతనిచ్చిన ఎన్‌హెచ్ఏఐ




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఫాస్టాగ్‌కు సంబంధించి జనవరి 28న ఎన్‌పీసీఐ జారీ చేసిన మార్గదర్శకాలు జాతీయ రహదారులపై ఉండే టోల్ ప్లాజాలకు వర్తించవని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) స్పష్టత ఇచ్చింది. మొన్నటి నుండి టోల్ ప్లాజాల వద్ద అమల్లోకి వచ్చిన కొత్త నిబంధనలు వాహనదారుల్లో గందరగోళానికి దారి తీశాయి. దీంతో ఎన్‌హెచ్ఏఐ వివరణ ఇచ్చింది. టోల్ ప్లాజా రీడర్ వద్దకు చేరుకునే సమయానికి 60 నిమిషాల కంటే ఎక్కువ సేపు ఫాస్టాగ్ యాక్టివ్‌గా లేకున్నా, స్కాన్ చేసిన తర్వాత 10 నిమిషాల వరకు యాక్టివ్‌గా లేకున్నా లావాదేవీలను తిరస్కరిస్తామంటూ ఎన్‌పీసీఐ ఇటీవలి మార్గదర్శకాలు జారీ చేసింది. ఇలాంటి సందర్భాల్లో టోల్ ఫీజును రెండింతలు చెల్లించవలసి ఉంటుందని తెలిపింది. అయితే, వాహనం టోల్ ప్లాజాలను దాటినప్పుడు ఫాస్ట్ ట్యాగ్ స్థితి విషయంలో ఫాస్టాగ్ జారీ చేసిన బ్యాంకు, టోల్ పేమెంట్ అందుకున్న బ్యాంకు మధ్య వివాదాల పరిష్కారాన్ని సులభతరం చేసేందుకు ఎన్‌పీసీఐ ఈ సర్క్యులర్‌ను జారీ చేసినట్లు ఎన్‌హెచ్ఏఐ తెలిపింది.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్ రావుకు ఊరట



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు దర్యాప్తుపై హైకోర్టు ఈరోజు స్టే విధించింది. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణ చేపట్టే వరకు ఎలాంటి చర్యలు చేపట్టవద్దని కోర్టు స్పష్టం చేసింది. తన ఫోన్‌ను ట్యాప్ చేశారంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వివిధ సెక్షన్ల కింద నమోదైన ఈ కేసులో ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను అరెస్టు చేశారు. అతను హరీశ్ రావు వద్ద గతంలో పని చేశాడు. తనపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును క్వాష్ చేయాలని హరీశ్ రావు, రాధాకిషన్ రావు పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో హరీశ్ రావును అరెస్టు చేయవద్దని హైకోర్టు గతంలో మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. మరోవైపు, ప్రభుత్వం తరఫున వాదనల కోసం లాయర్ సిద్ధార్థ లూథ్రా వస్తారని పీపీ కోర్టుకు తెలిపారు. లూథ్రా మరో కేసులో బిజీగా ఉన్నందున సమయం కావాలని కోరారు. దీంతో హైకోర్టు తదుపరి విచారణను మార్చి 3వ తేదీకి వాయిదా వేసింది.

## జగన్ పై నల్లపాడు పీఎస్ లో కేసు నమోదు



అమరావతి (ప్రశ్న న్యూస్) వైసీపీ అధినేత జగన్ గుంటూరు మిర్చి యార్డులో పర్యటించడంపై కేసు నమోదైంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, పర్యటనకు రావొద్దని ఈసీ, జిల్లా కలెక్టర్ చెప్పినప్పటికీ జగన్ మిర్చి యార్డు పర్యటనకు వచ్చారు. ఈ నేపథ్యంలో, ఆయనపై గుంటూరు జిల్లా నల్లపాడు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. ఈసీ, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాలు బేఖాతరు చేస్తూ మిర్చి యార్డులో కార్యక్రమం నిర్వహించారంటూ జగన్, అంబటి రాంబాబు, కొడాలి నాని, లేళ్ల అప్పిరెడ్డి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, నందిగం సురేశ్ తదితరులపై కేసు నమోదు చేశారు.

# బూడిద కాలుష్యం నుంచి మా గ్రామాన్ని కాపాడండి మహాప్రభు

- బూడిద అక్రమ రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు
- పశ్చిమ ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్ నుంచి రావాణ





కొండపల్లి (ప్రశ్న న్యూస్ ) బూడిద మాఫియాకు అద్దులేకుండా పోతోంది. నిషేధ ప్రాంతంలో అక్రమ రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వందలాది ట్రిప్పులు వేస్తూ జెబ్బులు నింపుకుంటున్నారు. అక్రమ బూడిద రవాణాను పశ్చిమ ఇబ్రహీంపట్నం వాసులు అధికార పార్టీ కౌన్సిలర్లులతో ఉదయం 8 గంటలకే ఎత్తే ప్రాంతానికి వెళ్లి అడ్డుకోవడం ఇప్పుడు పెద్ద చర్చగా మారింది. అధికార పార్టీ నాయకులు అక్రమ రవాణా చేస్తుంటే అదే పార్టీకీ చెందిన కౌన్సిలర్లు అడ్డుకోవడం ఇప్పుడు చర్చగా మారింది. గతంలో ఈ ప్రాంతంలో బూడిద రవాణాను నిలిపివేసిన అధికారులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తిరిగి ప్రారంభం చేయడం పై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ప్రదానంగా బూడిద రవాణా కు స్థానిక ప్రజా ప్రతినిధి అండగా ఉన్నారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. అంతే కాకుండా ఇబ్రహీంపట్నంకు చెందిన ఒక కీలక నాయకుడితో పాటు మండలానికి చెందిన ఒక ముఖ్య నాయకుడి కన్నుసన్నలోనే ఈ అక్రమ రవాణా జరుగుతోందనే వాదనలు బాగా వినిపిస్తున్నాయి. ఏడు జేసీబీలు, వంద లారీలతో నిత్యం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వారి వ్యాపారం సాగుతోంది. అంతే కాకుండా బూడిద నిల్వ చేయడం కోసం బూడిద పైపులను సైతం పగలుగొట్టి మరి నిల్వ చేస్తున్నారు. అయినా కానీ విటిపిఎస్ అధికారులు అటువైపు కూడా చూడకపోవడం చుస్తే వారే అక్రమ రవాణాకు అండగా ఉంటున్నారానే చర్చ నడుస్తుంది. నిషేధ ప్రాంతం నుంచి అక్రమ రవాణాను అడ్డుకొని తమ ప్రాణాలు కాపాడాలని పశ్చిమ ఇబ్రహీంపట్నం వాసులు కోరుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588